RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 159 | జులై 10 శుక్రవారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 159 | July 10 Fryday2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


ఈనెల 11న యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ ట్రస్ట్ బోర్డు ప్రమాణ స్వీకారం! 2

## 2047 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్

# డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

### నెక్స్ట్-జెన్ సోలార్ మాడ్యూల్ యూనిట్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి




**హైదరాబాద్ జనసంఘర్షణ**
తెలంగాణను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడంతో పాటు, దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం సీతారాంపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'ఇండియాస్ నెక్స్ట్-జెన్ సోలార్ మాడ్యూల్ యూనిట్'ను ముఖ్యమంత్రి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఎన్నికల వరకే రాజకీయం ఉండాలని, అధికారం కోల్పోయిన బాధతో ప్రతిపక్షాలు రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవద్దని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రగతికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

హైదరాబాద్ నగరాన్ని కాలుష్య రహితంగా మార్చేందుకు ప్రభుత్వం భారీ కసరత్తు చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఢిల్లీ తరహా కాలుష్యం, బెంగళూరు, చెన్నై నగరాల తరహా ట్రాఫిక్ సమస్యలు హైదరాబాద్‌కు రాకుండా ముందస్తు ప్రణాళికలతో ముందుకు వెళుతున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగానే ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న దాదాపు 2,100 చదరపు కిలోమీటర్ల పరిధిలోని పరిశ్రమలను ఓఆర్ఆర్ వెలుపలికి తరలించాలని నిర్ణయించినట్లు ప్రకటించారు. పెరి అర్బన్ రీజియన్‌లో ప్రత్యేక మాన్యుఫ్యాక్చరింగ్ జోన్లను ఏర్పాటు చేస్తామని, రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్ రీజియన్లుగా విభజించి

➤ మిగతా 2వ పేజీలో..

## మరోసారి కలవరపెడుతున్న కోవిడ్

### రాజంపేట వ్యక్తి మృతితో వైద్యారోగ్య శాఖ తీవ్ర అప్రమత్తం!



**తిరుపతి జనసంఘర్షణ**
కరోనా మహమ్మారి మరోమారు ప్రజల్లో కలవరాన్ని రేపుతోంది. కడప జిల్లా రాజంపేటకు చెందిన 52 ఏళ్ల వ్యక్తి కోవిడ్ కారణంగా మరణించడంతో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ తీవ్రంగా అప్రమత్తమైంది. ఈ ఘటన నేపథ్యంలో అధికారులు అన్ని జిల్లాల్లో ముందస్తు ఆరా తీయగా, ప్రస్తుతం కడప, తిరుపతి జిల్లాల్లో ఐదు కోవిడ్ పాజిటివ్ కేసులు నమోదైనట్లు గుర్తించారు. దీంతో రాష్ట్ర మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ (డిఎంఈ) అప్రమత్తమై, రాష్ట్రంలోని అన్ని ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రుల సూపరింటెండెంట్లకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న ఐసోలేషన్ బెడ్లు, ఐసీయూ పడకలు, ఆక్సిజన్ సౌకర్యం, వెంటిలేటర్లు, మందులు, ర్యాపిడ్ టెస్టింగ్ కిట్లు, అంబులెన్స్‌లు మరియు వైద్య సిబ్బంది వివరాలతో తక్షణమే నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు. అవసరమైతే బాధితులకు తక్షణ చికిత్స అందించేలా అన్ని ఏర్పాట్లను సిద్ధంగా ఉంచాలని వైద్యాధికారులను ఆదేశించారు.

ఈ కేసు వివరాల్లోకి వెళితే.. రాజంపేటకు చెందిన సదరు వ్యక్తి తీవ్రమైన ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతూ గత నెల 24న చికిత్స నిమిత్తం వేలూరులోని సీఎంసీ (జవీజ) ఆసుపత్రిలో చేరారు. అక్కడ ఆయనకు నిమోనియా సోకినట్లు వైద్యులు గుర్తించారు. అయితే, అనుమానంతో కోవిడ్ పరీక్షలు నిర్వహించగా 26వ తేదీన పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన పరిస్థితి విషమించడంతో 28వ తేదీన మృతి చెందారు. ఈ పరిణామాల నేపథ్యంలో తిరుపతిలోని రుయా ఆసుపత్రిలో ప్రత్యేక కోవిడ్ ఐసోలేషన్ వార్డును ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం టెస్ట్ కిట్లు, అవసరమైన మందులు, సిబ్బందిని సిద్ధంగా ఉంచామని, ఇప్పటివరకు రుయా ఆసుపత్రిలో ఎలాంటి కొత్త కేసులు నమోదు కాలేదని స్పష్టం చేశారు.

ప్రస్తుతం నమోదైన కేసుల్లో తీవ్రమైన కోవిడ్ లక్షణాలు లేవని, అయినప్పటికీ వాతావరణ మార్పుల కారణంగా రోగనిరోధక శక్తి తగ్గినవారు అశ్రద్ధ చేయకూడదని వైద్యాధికారులు సూచిస్తున్నారు. కరోనా విషయంలో గతంలో లాగా భయపడాల్సిన పనిలేదని, అయితే జ్వరం, దగ్గు, గొంతునొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యశాఖ హెచ్చరించింది.

## లైంగిక వేధింపుల కేసులో

# డొనాల్డ్ ట్రంప్‌కు చుక్కెదురు

### జీన్ క్యారల్‌కు రూ.47 కోట్ల పరిహారం చెల్లించాల్సిందే




**వాషింగ్‌టన్ జనసంఘర్షణ**
మెరికా మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత రిపబ్లికన్ నేత డొనాల్డ్ ట్రంప్‌నకు న్యాయస్థానంలో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ప్రముఖ రచయిత్రి, మాజీ కాలమిస్టు జీన్ క్యారల్ దాఖలు చేసిన లైంగిక వేధింపుల కేసులో ట్రంప్‌ను అమెరికా ఫెడరల్ కోర్టు దోషిగా నిర్ధారించింది. బాధితురాలికి ఐదు మిలియన్ల అమెరికన్ డాలర్లు (భారత కరెన్సీలో దాదాపు రూ.47 కోట్లు) నష్టపరిహారంగా చెల్లించాలని కోర్టు స్పష్టం చేసింది. గతంలో ఈ కేసుపై విచారణ జరిపిన జ్యూరీ, ట్రంప్ లైంగిక దాడికి పాల్పడటంతో పాటు క్యారల్ ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేశారని నిర్ధారించింది. ఇందులో భాగంగానే లైంగిక దాడికి సంబంధించి 2 మిలియన్ డాలర్లు, పరువు నష్టం కలిగించినందుకు మరో 3 మిలియన్ డాలర్లను పరిహారంగా

➤ మిగతా 2వ పేజీలో..

## వ్యవసాయ రంగానికి కాంగ్రెస్

# ప్రభుత్వం పెద్దపీట

### రెండున్నరేళ్లలోనే రైతులకు రూ.35 వేల కోట్లు.. ఖమ్మంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్ జనసంఘర్షణ**
తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, అన్నదాతలకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం లచ్చగూడెంలో పర్యటించిన ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం జగన్నాథపురం మత్కేపల్లి క్రాస్

➤ మిగతా 2వ పేజీలో..



## మార్కెట్‌లో స్థిరంగా పసిడి ధరలు

**న్యూఢిల్లీ జనసంఘర్షణ**
అంతర్జాతీయంగా మారుతున్న భౌగోళిక, ఆర్థిక పరిణామాల నేపథ్యంలో దేశీయ మార్కెట్‌లో పసిడి ధరలు క్రమంగా తగ్గుముఖం పడుతూ ప్రస్తుతం స్థిరత్వాన్ని ప్రదర్శిస్తున్నాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్

➤ మిగతా 2వ పేజీలో..



# 2047 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి..** సమతుల్య అభివృద్ధి సాధిస్తామని వివరించారు. ప్రజల సహకారంతో 2034 నాటికే తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిలబెట్టేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏటా 1.10 లక్షల మంది ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లు వస్తున్నారని, వారి సంఖ్యకు అనుగుణంగా పరిశ్రమలు తీసుకురావడంతో పాటు యువతలో నైపుణ్యాలను పెంచేందుకు స్కిల్స్ యూనివర్సిటీ, అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు సీఎం తెలిపారు. పరిశ్రమల స్థాపన కోసం సీతారాంపురం, రంగారెడ్డి జిల్లా రైతులు, ప్రజలు చేసిన త్యాగాలు అమూల్యమైనవని ఆయన కొనియాడారు. ఈ ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయిన కుటుంబాలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడంతో పాటు, ఉపాధి నిమిత్తం వ్యాపార సముదాయాలు నిర్మించి ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తామని, బుద్వేల్ నుండి కొడంగల్ వరకు 100 మీటర్ల వెడల్పుతో రహదారి పనులు సాగుతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

## ఈనెల 11న యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ ట్రస్ట్ బోర్డు ప్రమాణ స్వీకారం!

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన నూతన ట్రస్ట్ బోర్డు ప్రమాణ స్వీకార మహోత్సవం ఈనెల 11న (శనివారం) జరగనుంది. ఈ మేరకు గురువారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆలయ ఈవో (కార్యనిర్వహణాధికారి) భవాని శంకర్ వివరాలను వెల్లడించారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలోనే యాదగిరిగుట్ట ఆలయంలోని 'బంగారు వాకిలి' వద్ద ఉదయం 11:37 గంటలకు ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని అత్యంత శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ వేడుక ముగిసిన వెంటనే ఆలయ పరిధిలోని ప్రెసిడెంట్ సూట్‌లో నూతన ట్రస్ట్ బోర్డు మొదటి అధికారిక సమావేశం జరుగుతుందని వివరించారు.

ఈ కార్యక్రమం ద్వారా దేవస్థానం నూతన ట్రస్ట్ చైర్మన్‌గా ఎం. సత్యనారాయణ రెడ్డితో పాటు మరో ముగ్గురు సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అయితే ఈ ప్రమాణ స్వీకారోత్సవాన్ని చాలా నిరాడంబరంగా నిర్వహిస్తున్నామని, దీనికి ఎలాంటి ప్రత్యేక ముఖ్య అతిథులను ఆహ్వానించలేదని ఈవో స్పష్టం చేశారు. అలాగే భద్రతా, ఆలయ నిబంధనల దృష్ట్యా ఈ ప్రమాణ స్వీకార ఘట్టానికి మీడియాకు అనుమతి లేదని ఆయన వెల్లడించారు.

మరోవైపు, ఈ కార్యక్రమం నిర్వహణపై స్థానికంగా చిన్నపాటి చర్చ నడుస్తోంది. ఒకవైపు దేవస్థానం ఉన్నతాధికారులు కొంతమంది వీఐపీలకు స్వయంగా ఆహ్వాన పత్రికలను అందజేస్తూనే.. మరోవైపు మీడియా సమావేశంలో ఎవరికీ ఆహ్వానాలు పంపలేదని చెప్పడం విచిత్రంగా ఉందంటూ స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఏదేమైనప్పటికీ, యాదద్రి నూతన పాలకమండలి కొలువుదీరనుండటంతో ఆలయ అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని భక్తులు ఆశిస్తున్నారు.

## జ్ఞానేశ్వరి కోసం ముమ్మర గాలింపు

### కొండప్రాంతంలో మళ్లీ ముమ్మరంగా తనిఖీ

**కాకినాడ, :** కాకినాడ జిల్లా తుని మండలం సీహెచ్ అగ్రహారం గ్రామానికి చెందిన చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యమైన కేసులో మరోసారి గాలింపు చర్యలు వేగవంతమయ్యాయి. జూన్ 6వ తేదీన అదృశ్యమైన చిన్నారి ఆచూకీ కోసం అధికారులు విస్తృత స్థాయిలో శోధిస్తున్నారు. ముఖ్యంగా చిన్నారి ఇంటి వెనుక ఉన్న కొండ ప్రాంతంలో మళ్లీ గాలింపు చర్యలు చేపట్టారు. ఆ ప్రాంతంపై పూర్తి అవగాహన ఉన్న స్థానికుల సహకారంతో అధికారులు శోధిస్తున్నారు. ఈ నేపథ్యంలో కాకినాడ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సీహెచ్ అగ్రహారం గ్రామాన్ని సందర్శించి జ్ఞానేశ్వరి కుటుంబ సభ్యులను పరామర్శించారు. చిన్నారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ప్రభుత్వం వారికి అండగా నిలుస్తోందని భరోసా ఇచ్చారు. చిన్నారి ఆచూకీ కోసం అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందని, గాలింపు చర్యలను మరింత విస్తృతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇదే సమయంలో కుటుంబానికి అవసరమైన ఆర్థిక సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. చిన్నారి జ్ఞానేశ్వరి కోసం ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు. ఈ కేసును అత్యంత ప్రాధాన్యంతో పరిశీలిస్తున్నామని చెప్పుకొచ్చారు. గాలింపు చర్యలు ఆగకుండా కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. చిన్నారి ఆచూకీ లభించే వరకు అన్ని అవకాశాలను పరిశీలిస్తామని స్పష్టం చేశారు.జ్ఞానేశ్వరి అదృశ్యం కేసు జిల్లాలో తీవ్ర ఆందోళనకు కారణమైంది. చిన్నారి క్షేమంగా తిరిగి రావాలని కుటుంబ సభ్యులతో పాటు స్థానిక ప్రజలు కూడా కోరుకుంటున్నారు. ఈ కేసులో జరుగుతున్న ప్రతి పరిణామంపై అధికారులు నిశితంగా నిఘా ఉంచి చర్యలు చేపడుతున్నారు.

–

# వ్యవసాయ రంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

**మొదటిపేజీ తరువాయి..** రోడ్డులో ఏర్పాటు చేయనున్న 'రైతు ఆశీర్వాద సభ' వివరాలను మీడియాకు వెల్లడించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రైతు భరోసాకు రూ.75 వేల కోట్లు ఖర్చు చేస్తే, తమ కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రెండున్నరేళ్ల స్వల్ప కాలంలోనే ఏకంగా రూ.35 వేల కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లోకి చేర్చిందని భట్టి విక్రమార్క లెక్కలతో సహా వివరించారు. కేసీఆర్ హయాంలో పంట నష్టపోయిన రైతులకు (క్రాప్ డ్యామేజ్) ఒక్క పైసా కూడా ఎందుకు ఇవ్వలేదని ఆయన ఈ సందర్భంగా ప్రశ్నించారు. రైతు సంక్షేమం పట్ల తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని వివరిస్తూ.. కేవలం తొమ్మిది రోజుల వ్యవధిలోనే ఎనిమిది ఎకరాల లోపు ఉన్న రైతులకు రూ.8,759 కోట్లను విడుదల చేశామని డిప్యూటీ సీఎం తెలిపారు. త్వరలో జరగబోయే రైతు ఆశీర్వాద సభ ద్వారా 9 ఎకరాల నుండి 50 ఎకరాల వరకు ఉన్న రైతులకు మరో రూ.1,900 కోట్ల రైతు భరోసా నిధులను విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రిమండలి సహా పాల్గొనే ఈ సభకు రైతులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఇదే క్రమంలో జగన్నాధపురంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న మెగా రైతు మేళాను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ కలిసి ప్రారంభించారు. ఆధునిక సాగు పద్ధతులు, సరికొత్త సాంకేతికతపై రైతులకు అవగాహన కల్పించడమే ఈ మేళా ముఖ్య ఉద్దేశమని వారు పేర్కొన్నారు.

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావం వల్ల ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదవుతున్నందున రైతులు తక్కువ కాలంలో పూర్తయ్యే ఆరుతడి, పప్పుధాన్యాల పంటలపై దృష్టి సారించాలని సూచించారు. నాగార్జునసాగర్‌లో నీటి నిల్వలు తక్కువగా ఉన్నప్పటికీ, సీతారామ ప్రాజెక్టు, రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా వైరా రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేస్తున్నామని, ఆ నీరు త్వరలోనే చేరుతుందని భరోసా ఇచ్చారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కోరిక మేరకు మధిర నియోజకవర్గంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా మొక్కజొన్న కొనుగోళ్లను చేపట్టామని తుమ్మల వెల్లడించారు. ఎరువుల బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టడానికి ప్రత్యేక యాప్ ద్వారా యూరియా పంపిణీ చేస్తున్నామని, వాతావరణ సమాచారాన్ని కూడా సాంకేతికత ద్వారా ఎప్పటికప్పుడు రైతులకు అందిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం మాటలకే పరిమితం కాకుండా, వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహిస్తూ రైతుల ఆదాయం పెంచేలా ఆచరణాత్మక చర్యలు తీసుకుంటోందని ఈ సందర్భంగా నేతలు పునరుద్ఘాటించారు.

# జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యకు పరిష్కారం

### సిఎంతో చర్చిస్తానని డిప్యూటి సిఎం భట్టి హామీ

**ఖమ్మం, :** సొసైటీలతో సంబంధం లేకుండా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించే అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఖమ్మం జిల్లా కమిటీ గురువారం చింతకాని మండలం లచ్చగూడెంలో సమర్పించిన వినతిపత్రంపై భట్టి సానుకూలంగా స్పందించారు. శుక్రవారం జగన్నాథపురం లో నిర్వహించనున్న రైతు ఆశీర్వాద సభకు ముఖ్యమంత్రి హాజరవుతున్న నేపథ్యంలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లాలని ఫెడరేషన్ ప్రతినిధులు కోరారు. దీనిపై స్పందించిన భట్టి విక్రమార్క.. సొసైటీల ద్వారా స్థలాల కేటాయింపులో న్యాయపరమైన చిక్కులు ఉన్నందున, వాటికి అతీతంగా వ్యక్తిగతంగా, బీపీఎల్ కోటా లేదా ఇతర విధానాల ద్వారా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందించే మార్గాలను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. వినతిపత్రంలో టీడబ్ల్యూజేఎఫ్ నేతలు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అధిక సంఖ్యలో జర్నలిస్టులు పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారని, తక్కువ వేతనాలతో అ÷–దదె ఇళ్లలో నివసిస్తూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం గత, ప్రస్తుత ప్రభుత్వాల దృష్టికి పలుమార్లు విజ్ఞప్తులు చేయడంతో పాటు ఉద్యమాలు కూడా నిర్వహించినట్లు తెలిపారు. గత ప్రభుత్వం వెలుగుమట్ల వీవీ పాలెం రెవెన్యూ పరిధిలో 23 ఎకరాలకు పైగా భూమిని కేటాయిస్తూ జీవో జారీ చేసినప్పటికీ, అది అమలుకు నోచుకోలేదని గుర్తు చేశారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో కొన్ని న్యాయపరమైన సందిగ్ధతలు ఏర్పడినప్పటికీ, సొసైటీలతో సంబంధం లేకుండా వ్యక్తిగతంగా ఇళ్ల స్థలాలు ఇస్తామని ముఖ్యమంత్రి ఇప్పటికే హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

ఈ ప్రక్రియలో జాప్యాన్ని వీడి, జర్నలిస్టులకు ఏ ప్రాతిపదికన, ఎప్పటిలోగా ఇళ్ల స్థలాలు కేటాయిస్తారో నిర్దిష్టమైన గడువుతో ప్రకటించేలా ముఖ్యమంత్రితో చర్చించాలని ఉపముఖ్యమంత్రిని కోరారు.

వినతిపత్రం సమర్పించిన వారిలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ ఖదీర్, జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షుడు దువ్వా సాగర్, టీబీజేఏ జిల్లా అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి మానుకొండ రవికిరణ్, జిల్లా కమిటీ సభ్యులు రాంపుడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్‌లో స్థిరంగా పసిడి ధరలు

**మొదటిపేజీ తరువాయి..** తాజా గణాంకాల ప్రకారం.. గురువారం ఉదయం సమయానికి తెలుగు రాష్ట్రాల ప్రధాన నగరాలైన హైదరాబాద్, విజయవాడల్లో 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర 10 గ్రాములకు రూ.1,43,120 వద్ద కొనసాగుతోంది. అదేవిధంగా, నగల తయారీకి ఉపయోగించే 22 క్యారెట్ల ఆర్నమెంటల్ బంగారం ధర 10 గ్రాములకు రూ.1,31,190గా నమోదైంది. మరోవైపు, పసిడి బాటలోనే వెండి ధరలు కూడా స్వల్పంగా తగ్గాయి. కిలో వెండి ధరపై రూ.100 మేర మేర క్షీణత కనిపించింది. తాజా తగ్గుదలతో హైదరాబాద్, విజయవాడ నగరాల్లో ప్రస్తుతం కిలో వెండి ధర రూ.2,44,900 వద్ద విక్రయించబడుతోంది. అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న ఒడిదొడుకుల వల్లే బులియన్ మార్కెట్‌లో ఈ తరహా ధరల మార్పులు చోటుచేసుకుంటున్నాయని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# లైంగిక వేధింపుల కేసులో డొనాల్డ్ ట్రంప్‌కు చుక్కెదురు

**మొదటిపేజీ తరువాయి..** ఇవ్వాలని మే 2023లోనే కోర్టు తీర్పునిచ్చింది. అయితే, ఈ తీర్పును సవాల్ చేస్తూ ట్రంప్ దాఖలు చేసిన అప్పీలును విచారించడానికి గత వారం అమెరికా సుప్రీంకోర్టు సైతం నిరాకరించడంతో ఆయనకు చట్టపరమైన అన్ని మార్గాలు మూసుకుపోయినట్లయింది. ఈ వివాదం నేపథ్యాన్ని పరిశీలిస్తే.. 1996లో న్యూయార్క్‌లోని ఒక ప్రముఖ డిపార్ట్‌మెంట్ స్టోర్ డ్రెస్సింగ్ రూమ్‌లో తనపై ట్రంప్ లైంగిక దాడికి పాల్పడ్డారని జీన్ క్యారల్ ఆరోపించారు. ఈ సంచలన నిజాన్ని ఆమె 2019లో ప్రచురితమైన తన పుస్తకంలో వెల్లడించారు. అయితే ఈ ఆరోపణలను డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా ఖండించారు. అవన్నీ పూర్తిగా కల్పితాలని, క్యారల్‌కు మానసిక స్థితి సరిగ్గా లేదంటూ కొట్టిపారేశారు. ఈ క్రమంలోనే ట్రంప్‌పై పరువు నష్టం దావా కూడా నమోదైంది. కాగా, ట్రంప్ ఎదుర్కొంటున్న సివిల్ కేసులలో ఇది ఒకటి మాత్రమే కావడం గమనార్హం. 2024లో జరిగిన మరో పరువు నష్టం కేసు విచారణలో భాగంగా, క్యారల్‌కు అదనంగా 83.3 మిలియన్ డాలర్లు చెల్లించాలని మరో జ్యూరీ తీర్పు ఇచ్చింది. ప్రస్తుతం ఆ కేసు కూడా న్యాయపరమైన ప్రక్రియలో కొనసాగుతోంది. తాజా పరిణామాలతో అమెరికా రాజకీయాల్లో ఈ తీర్పు హాట్ టాపిక్‌గా మారింది.

## తాడిచర్ల-2 బొగ్గు గని కేటాయింపు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కృషి ఫలితమే: డిప్యూటీ సీఎం భట్టికి బీజేపీ ఎమ్మెల్యే పాయల శంకర్ కౌంటర్

తాడిచర్ల–2 బొగ్గు గని కేటాయింపు పూర్తిగా కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి నిరంతర కృషి ఫలితమేనని ఆదిలాబాద్ బీజేపీ ఎమ్మెల్యే పాయల శంకర్ స్పష్టం చేశారు. గతంలో యూపీఏ–2 ప్రభుత్వ హయాంలో అటు కేంద్రంలోనూ, ఇటు ఉమ్మడి రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పార్టీయే అధికారంలో ఉన్నప్పటికీ.. తాడిచర్ల–2 బొగ్గు గనిని సింగరేణికి కేటాయించలేకపోయిందని ఆయన విమర్శించారు. ఈ గని కేటాయింపుపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ బిడ్డగా సింగరేణి కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఒప్పించి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఈ గనిని సింగరేణికి కేటాయించేలా చేశారని వెల్లడించారు. తాడిచర్ల గని కేటాయింపును స్వాగతిస్తూ సింగరేణి కార్మిక సంఘాలు ప్రధాని మోదీ, కిషన్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకాలు చేస్తున్నాయని, కార్మికుల్లో వ్యక్తమవుతున్న ఈ ఆనందాన్ని, బీజేపీకి వస్తున్న ప్రజాదరణను కాంగ్రెస్ పార్టీ సహించలేకపోతోందని మండిపడ్డారు. ఇదే క్రమంలో సింగరేణి సంస్థ ఆర్థిక పరిస్థితిపై పాయల శంకర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. 2014 నుండి 2023 వరకు పాలించిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణిపై రూ.32 వేల కోట్ల బకాయిల భారాన్ని మోపగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మరో రూ.22 వేల కోట్ల బకాయిలను పెంచిందని ధ్వజమెత్తారు. ఈ విధంగా రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి మొత్తం రూ.55 వేల కోట్ల బకాయిలను చెల్లించాల్సి ఉందన్న ఆయన.. సంస్థను ఈ దుస్థితికి చేర్చినందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులను కార్మికులు నిలదీయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ బకాయిలను ఎప్పుడు, ఏ విధంగా చెల్లిస్తుందో స్పష్టమైన కార్యాచరణను ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఈ బకాయిల అంశాన్ని తాము ఖచ్చితంగా లేవనెత్తుతామని స్పష్టం చేశారు.

సింగరేణి సంస్థలో కేంద్ర ప్రభుత్వానికి 49 శాతం వాటా ఉందని గుర్తు చేసిన పాయల శంకర్.. సంస్థ వ్యవహారాల్లో కేంద్రం మరింత చురుగ్గా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తనకున్న 51 శాతం వాటా అధికారాన్ని అడ్డం పెట్టుకుని సింగరేణి

# మెదక్ పోషకాహార లోపం లేని జిల్లాగా తీర్చిదిద్దాలి

- కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులకు సూచించారు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 9(జన సంఘర్షణ)
పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగామహిళా శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా విద్యాశాఖ అధికారులతో కలెక్టరేట్లో గురువారం జిల్లా పోషణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో తీవ్ర పోషణ లోపంతో ఉన్న పిల్లలను గుర్తించి, వారిని వైద్య శాఖ సాయంతో ఎన్ఆర్సీకి పంపించాలన్నారు. అక్కడ ప్రత్యేక ఆహారం, చికిత్స ద్వారా పిల్లలు పరిపూర్ణ ఆరోగ్యవంతులుగా తయారవుతారని తెలిపారు. మునగ, కరివేపాకు, నిమ్మ వంటివి ఆహారంలో భాగంగా తీసుకోవాలని చెప్పారు. అలాగే అంగన్వాడి కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని అన్నారు. అంగన్వాడి కేంద్రాలలో పోషణ వాటికలు ఏర్పాటు చెయ్యాలని ఆదేశించారు. పోషణ వాటికలలో కచ్చితంగా మునగ మొక్కలు ప్రతి అంగన్వాడి కేంద్రంలో పెట్టాలని చెప్పడం జరిగిందని 15వ తేదీ వరకు అందరూ పిల్లల పోషణ స్థాయిని గుర్తించి ఈ నెలకు సంబంధించిన పూర్తి నివేదికను అందించాలన్నారు. జిల్లాల వైద్య ఆరోగ్యశాఖ ద్వారా పిల్లలకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. విద్యాశాఖ ద్వారా చేపట్టాల్సిన కార్యక్రమాలపై




ప్రణాళిక అబద్ధంగా ముందుకు పోవాలన్నారూ ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమఅధికారి హేమ భార్గవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గణేష్ వర్ విద్యాశాఖ అధికారి రాజు ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భూముల రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

- రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్.
- మొదటి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో రీ సర్వే.
- డీజీపీఎస్, రోవర్స్, జీఐఎస్ సాంకేతికతతో పారదర్శక సర్వే.
- 60 రోజులకు మించి భూ భారతి దరఖాస్తులు పెండింగ్‌లో ఉండొద్దు.
- రీ సర్వే గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలి.
- భూముల రీ సర్వే, నక్ష భూములపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రెవెన్యూ శాఖ కార్యదర్శి.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 9(జన సంఘర్షణ)
భూముల రీ సర్వేను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అత్యంత పారదర్శకంగా నిర్వహించి ప్రతి భూమికి స్పష్టమైన యాజమాన్య హక్కులు కల్పించాలని రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్.లోకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. భూముల రీ సర్వే, నక్ష భూముల అంశాలపై రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్.లోకేష్ కుమార్, ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.మెదక్ కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఏడి ల్యాండ్ సర్వే కిషన్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూముల రీ సర్వేను దశలవారీగా చేపడుతోందని తెలిపారు.తొలి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో రీ సర్వే నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సర్వేతో ప్రతి సర్వే నంబర్‌కు స్పష్టమైన యాజమాన్య





హక్కులు నిర్ధారించడంతో పాటు ప్రతి భూమికి ప్రత్యేక భూధార్ యూనిక్ నంబర్ కేటాయించనున్నట్లు తెలిపారు.డీజీపీఎస్ రోవర్స్, జీఐఎస్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి రీ సర్వే చేపట్టాలని ఆదేశించారు. రీ సర్వే జరుగుతున్న ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించి ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని, ఆయా గ్రామసభల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, మంత్రులను భాగస్వాములను చేయాలని సూచించారు. రీ సర్వేలో రెగ్యులర్ సర్వేయర్లతో పాటు లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. సోమవారం నుంచి సర్వేయర్లు, జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బందికి బ్యాచ్‌ల వారీగా సమగ్ర శిక్షణ నిర్వహించి అనంతరం అన్ని గ్రామాల్లో రీ సర్వే కార్యక్రమాలు ప్రారంభించాలని ఆదేశించారు. జిల్లా స్థాయిలో కూడా ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రీ సర్వే పూర్తయ్యే వరకు రెగ్యులర్ సర్వేయర్లలో 25 శాతం మందిని రొటేషన్ పద్ధతిలో విధుల్లో వినియోగించాలని తెలిపారు. లైసెన్స్‌డ్ సర్వేయర్ల పనితీరును శాఖ సర్వేయర్లు నిరంతరం పర్యవేక్షించాలని, డిప్యూటీ తహసీల్దార్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో రీ సర్వే పనులను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో రీ సర్వే నాణ్యతతో నిర్వహించాలని, సర్వేలో ఉపయోగించే ఆధునిక పరికరాల వినియోగాన్ని సాంకేతికంగా పర్యవేక్షించే వ్యవస్థ అందుబాటులో ఉందని, వాటిని సమర్థవంతంగా ఉపయోగించాలని సూచించారు.రీ సర్వేలో పాల్గొనే లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ప్రభుత్వం గౌరవ వేతనం అందజేస్తుందని తెలిపారు. భూ భారతి దరఖాస్తుల పరిష్కారంలో అసాధారణ జాప్యంపై ఉన్నత న్యాయస్థానం తీవ్ర వ్యాఖ్యలు చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ, సాధారణ విధులు నిర్వహించడానికి కోర్టు ఆదేశాలు అవసరమా అని హైకోర్టు ప్రశ్నించిందని తెలిపారు.ప్రస్తుతం ప్రతి అధికారి వద్ద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై హైకోర్టు వివరణ కోరుతోందని, స్పందించేందుకు నాలుగు వారాల గడువు లభించిందన్నారు.రెవెన్యూ కార్యాలయంలోనూ భూ భారతి దరఖాస్తులు 60 రోజులకు మించి పెండింగ్‌లో ఉండకూడదని, పెండింగ్ దరఖాస్తులను అత్యంత త్వరగా పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.ఈ వీసీ లో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రోబోటిక్స్‌తో గ్రామీణ విద్యార్థుల్లో నైపుణ్య విప్లవం

- మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వినూత్న ముందడుగు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 9(జన సంఘర్షణ)
ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి), మెదక్ విద్యార్థులు కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా, సమాజానికి ఉపయోగపడే విధంగా తమ జ్ఞానాన్ని పంచుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ హుస్సేన్ తెలిపారు. ముఖ్యంగా, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రోబోటిక్స్ పాఠాలు బోధిస్తూ, వారిలో సాంకేతిక నైపుణ్యాలు, సృజనాత్మకత, సమస్య పరిష్కరణ సామర్థ్యాలను పెంపొందించేందుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.
నేటి ఆధునిక యుగంలో రోబోటిక్స్‌కు విశేష ప్రాధాన్యం పెరుగుతోంది. కృత్రిమ మేధస్సు, ఆటోమేషన్, డిజిటల్ టెక్నాలజీ వంటి రంగాల్లో వేగంగా జరుగుతున్న అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని, విద్యార్థులకు చిన్న వయస్సులోనే రోబోటిక్స్ పరిజ్ఞానం అందించడం అత్యవసరం. ఇది భవిష్యత్తులో ఉపాధి అవకాశాలను విస్తరించడమే కాకుండా, దేశ అభివృద్ధికి దోహదపడే నైపుణ్యాలను పెంపొందిస్తుంది. హైదరాబాద్‌లోని సోహం అకాడమీ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్‌తో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మెదక్ భౌతిక శాస్త్ర విభాగం కుదుర్చుకున్న పరస్పర ఒప్పందం మేరకు, భౌతిక శాస్త్ర విద్యార్థులకు రోబోటిక్స్‌లో ప్రత్యేక శిక్షణ అందించబడింది. ఈ శిక్షణ పొందిన విద్యార్థులు జిల్లా విద్యాశాఖ మార్గదర్శకత్వంలో మెదక్ జిల్లాలోని 14 ప్రభుత్వ పాఠశాలల్లో రోబోటిక్స్ పాఠాలు బోధిస్తూ, పాఠశాల విద్యార్థుల్లో సాంకేతిక అవగాహనను పెంపొందిస్తున్నారు. ఈ వినూత్న కార్యక్రమాన్ని "రోబోటిక్స్ ఇన్ అకాడమిక్స్"గా పిలుస్తున్నారు. ఈ కార్యక్రమం అమలు విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించేందుకు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్






హుస్సేన్, కళాశాల భౌతిక శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ .తిరుమల్ రెడ్డి, డాక్టర్ సుధా రాణి, కళాశాల పరిపాలన అధికారి అంజద్ అలీ లతో కలిసి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సర్దనను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మమేకమై, కార్యక్రమం అమలుతీరు, వారి ఆసక్తి, నేర్చుకునే విధానంపై సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. "గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని చేరువ చేయడం ద్వారా వారి భవిష్యత్తును మెరుగుపరచడం మా లక్ష్యం. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, నైపుణ్యాలు గణనీయంగా పెరుగుతున్నాయి" అని తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్యార్థుల నుండి విశేష స్పందన లభిస్తోందని, భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని వినూత్న కార్యక్రమాలను విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది.

# కాలం చెక్కిన శిల్పం

ఆదిమ శిలల గర్భం నుండి పెకిలించి వచ్చిన చైతన్యపు తొలి కిరణం నేను...
గాలులు ఊయల లోగే అరణ్యాల నుంచి నగరాల పోరు దాకా సాగిన నా ప్రయాణం
ఎడతెగని ఆరాటం, ఒక అనంత అన్వేషణ కాలం అనే కుమ్మరి చక్రం మీద
ఎన్నో జన్మల రూపాయలను దిద్దుకుంటూ నేలతల్లి మురిపెం కోసం
చమట చుక్కలతో నేలను తడుముకుంటూ ఆశల రెక్కలు తుడుక్కొని నింగిని తాకాలని రెపరెపలాడే పక్షిని నేను!



తెల్లవారుజామున పూచే మల్లెల పరిమళం నేను
చీకటిని తరిమేసే సూర్య కిరణం నేను
ప్రతి ఉదయం నాతో నేను యుద్ధం చేస్తూ...
ప్రతి రాత్రి నన్ను నేను ఓదార్చుకుంటూ...
జీవితం అనే పుస్తకంలో రోజు ఒక కొత్త పేజీని రాసుకుంటూ... పోతున్నా!
నదుల ప్రవాహం నా రక్తంలో ప్రవహిస్తోంది.
కొండల స్థైర్యం నా నరాల్లో నిండి ఉంది .
పూల సున్నితత్వం నా మనసును అల్లుకుంది
గమ్యం తెలియని బాటసారి నైనా
ప్రతి అడుగులోనూ ఒక కొత్త ఉత్సాహం
ప్రతి మలుపులోనూ ఒక కొత్త అనుభూతి!
వలస పక్షుల కలవరింతలు నా పాటలో ఉన్నాయి
గాల్లో ఎగిరే ఆశలు నా కలలో ఉన్నాయి
చిరునవ్వుల వెన్నెల నా కళ్ళల్లో ఉంది
కాలం నన్ను ఎంతగా పరీక్షించినా...
ప్రతిసారి కొత్తగా... పురుడు పోసుకునే ఒక అజయమైన శక్తిని నేను!
ఎదురు గాలిని ఈదుకుంటూ వెళ్లే నా పయనం ఒక తపస్సు, ఒక నిరంతర సాధన!
నిన్నటిని దిగమింగుకొని నవ్వడం నేర్చుకున్నా
ఓటమిని మెట్టుగా మలుచుకుని ఎగరడం తెలుసుకున్నా
నేను సృష్టికి ఇచ్చిన అందమైన కానుకను...
అవును, కాలం తన చేతులతో చేసుకున్న ఒక సజీవ శిల్పాన్ని నేను!

కలం : బత్తుల వెంకటేశ్వర్లు, చర్ల

# బాధితులకు బాసటగా బానోత్ మనీషా లక్ష్మి మదన్ లాల్

- సింగరేణి మండలంలో విస్తృత పర్యటన.. కుటుంబాలకు ధైర్యం చెప్పిన బీఆర్ఎస్ నాయకురాలు

సింగరేణి ప్రతినిధి: (జన సంఘర్షణ)
సింగరేణి మండలంలో బీఆర్ఎస్ పార్టీ వైరా నియోజకవర్గ నాయకురాలు బానోత్ మనీషా లక్ష్మి మదన్ లాల్ విస్తృతంగా పర్యటించి పలువురు బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఇటీవల అనారోగ్యం, ప్రమాదాలు, కుటుంబ విషాదాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబ సభ్యులను కలిసి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు ధైర్యం చెబుతూ, కష్టకాలంలో అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. పర్యటనలో భాగంగా మాదారం గ్రామ ఉపసర్పంచ్ బానోత్ లాలు, పేరుపల్లి గ్రామానికి చెందిన బుడిగ శ్రీను, పాత కమలాపురం మాజీ సర్పంచ్ దివంగత తేజవత్ బాబురావు కుటుంబ సభ్యులు, అలాగే భూక్యా జీవన్ కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని, బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తుందని, బాధితులకు అవసరమైన సహకారం అందించేందుకు సిద్ధంగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ జగన్, మాజీ దిశ కమిటీ సభ్యుడు డొంకెన రవీందర్, లకావత్ లక్ష్మణ్, పేరుని వెంకటేశ్వర్లు, యువజన నాయకులు జడల కళ్యాణ్, రామారావు, హరీష్, గంగారబోయిన మురళి, పిల్లలమర్రి వెంకటేష్, మధు, పెద్దబోయిన సురేష్, సంపత్ తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామ్యం కావడం తమ పార్టీ విధానమని, బాధిత కుటుంబాలకు అండగా నిలవడం ద్వారా సామాజిక బాధ్యతను నిర్వర్తిస్తున్నామని బానోత్ మనీషా లక్ష్మి మదన్ లాల్ పేర్కొన్నారు.



# చేగుంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నారాయణరెడ్డిని పరామర్శించిన కంఠరెడ్డి తిరుపతిరెడ్డి

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 9(జన సంఘర్షణ)
చేగుంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నారాయణరెడ్డి సతీమణి కోమండ్ల మంజుల ఇటీవల మృతి చెందగా, బీఆర్ఎస్ జిల్లా నాయకులు కంఠ రెడ్డి తిరుపతిరెడ్డి గురువారం ఇబ్రహీంపూర్‌లోని వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మంజుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నారాయణరెడ్డిని కలిసి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ మనోధైర్యాన్ని అందించారు. మంజుల మృతి కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, ఈ విషాదాన్ని తట్టుకునే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. వీరి వెంట కల్వకుంట సర్పంచ్ అందె. కొండల్ రెడ్డి, ఏడుపాయల దేవస్థానం మాజీ చైర్మన్ బాల గౌడ్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.



# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన బిఆర్ఎస్ జిల్లా నాయకులు కంఠరెడ్డి తిరుపతిరెడ్డి

- రూ.5 వేల ఆర్థిక సాయం.


ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 9(జన సంఘర్షణ)
ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుర్తివాడ గ్రామానికి చెందిన సంజులు భార్య జయమ్మ కుటుంబ సభ్యులను గురువారం కంఠరెడ్డి తిరుపతిరెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా జయమ్మ మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేసిన ఆయన, రోడ్డు ప్రమాదంలో జయమ్మ మృతి చెందడం ఎంతో బాధాకరమని అన్నారు. బాధిత కుటుంబానికి తన వంతు సహాయంగా రూ.5,000 ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏడుపాయల దేవస్థానం మాజీ చైర్మన్ బాలగౌడ్, మాజీ గ్రామ అధ్యక్షుడు సిద్ధిరామిరెడ్డి, మాజీ ఏడుపాయల దేవస్థానం డైరెక్టర్ మోహన్‌రావు,బిఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల సతీష్, కల్వకుంట సర్పంచ్ అందె కొండల్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్, విల్సన్, చంద్రమోహన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



జన సంఘర్షణ
శుక్రవారం
10 జులై 2026

# సూపర్ ఎల్‌నినో ప్రభావంపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలి

- రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.
- సాగునీటి లభ్యత లేని ప్రాంతాల్లో వరి సాగు చేయ వద్దు.
- తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను విస్తృతంగా ప్రోత్సహించాలి.
- జూలై 15 తర్వాత జలాశయాల నీటి నిల్వల ఆధారంగా పంటలపై రైతులకు మార్గదర్శకాలు.
- మహారాష్ట్ర, కర్ణాటక వరద పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలి.
- సూపర్ ఎల్‌నినోను పంటల వైవిధ్యీకరణకు అవకాశంగా మలుచుకోవాలి.
- వ్యవసాయం, సాగునీరు, వర్షపాతం పరిస్థితులపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర మంత్రులు, సీఎస్.
- సూపర్ ఎల్‌నినో ప్రభావంపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.









ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 9(జన సంఘర్షణ)
సూపర్ ఎల్‌నినో ప్రభావం, రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు, జలాశయాల్లో నీటి నిల్వలు, ఖరీఫ్ పంటల ప్రణాళికపై రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్ సింగ్ మిషన్ భగీరథ ఇంట్రా నాగభూషణం ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. జూలై 9 నాటికి రాష్ట్రంలో 15 శాతం వర్షపాతం లోటు నమోదైందన్నారు. 14 జిల్లాల్లో సాధారణ వర్షపాతం, 19 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైందని తెలిపారు. కృష్ణా బేసిన్‌లో గతేడాదితో పోలిస్తే నీటి నిల్వలు గణనీయంగా తగ్గాయని, ఇప్పటివరకు ఎగువ రాష్ట్రాల నుంచి ఎలాంటి ప్రవాహం రాలేదన్నారు. ప్రస్తుతం శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో తాగునీటికి మాత్రమే సరిపడా నీరు అందుబాటులో ఉందన్నారు. గోదావరి బేసిన్‌లోని ఎస్సారెస్పీ, నిజాంసాగర్, సింగూరు, కడెం, ఎల్లంపల్లి ప్రాజెక్టులకు ఇప్పటివరకు వరద రాలేదని, వచ్చే వారం రోజులపాటు భారీ వర్షాల అవకాశాలు లేవని వాతావరణ శాఖ అంచనా వేసిందన్నారు. నిపుణుల అంచనాల ప్రకారం ఈ సీజన్‌లో ఆగస్టులో మాత్రమే సాధారణానికి సమీపంలో వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, జూలైలో 25 శాతం, ఆగస్టులో 9 శాతం, సెప్టెంబరులో 42 శాతం, అక్టోబరులో 55 శాతం లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందన్నారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో వచ్చే వరదలపైనే కృష్ణా, గోదావరి ప్రాజెక్టులు నిండే పరిస్థితి ఆధారపడి ఉందని, ఆ అవకాశాలు కూడా పరిమితంగానే ఉన్నాయని తెలిపారు. గోదావరి, కృష్ణా బేసిన్ పరిధిలో నీటి నిల్వలు తక్కువగా ఉన్నందున ఈ ఖరీఫ్‌లో సాగునీటి విడుదలకు ప్రణాళికలు లేవని రైతులకు స్పష్టంగా తెలియజేయాలని మంత్రి ఆదేశించారు. దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల పరిధిలో సాధ్యమైన మేరకు నీటిని తరలించి చెరువులు, కుంటలు నింపేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. సాగునీటి లభ్యత లేని ప్రాంతాల్లో రైతులు వరి సాగు చేయవద్దని స్పష్టమైన సందేశం ఇవ్వాలని, తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని సూచించారు. రైతు వేదికలు, ప్యాక్స్‌ల ద్వారా రైతులకు నీటి లభ్యత, వర్షపాతం అంచనాలపై విస్తృత అవగాహన కల్పించాలని, ప్రతి రైతు వాస్తవ పరిస్థితులను తెలుసుకుని పంటలు సాగు చేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. సూపర్ ఎల్‌నినో ప్రభావం, జలాశయాల్లో నీటి కొరతపై రైతులకు నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. వాతావరణం, వరద పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజాప్రతినిధులు, రైతులకు సమాచారం అందించాలని సూచించారు. నీటి లభ్యతకు అనుగుణంగా విత్తనాల సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, జూలై 15 తర్వాత జలాశయాల్లో నీటి నిల్వలను సమీక్షించి ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు స్పష్టమైన సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో వరద పరిస్థితులను నిరంతరం పరిశీలిస్తూ ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వరద వస్తే వెంటనే నీటిని ఎత్తిపోసేలా పంపింగ్ వ్యవస్థలను సిద్ధంగా ఉంచాలని, అప్పటివరకు అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకే ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ..సూపర్ ఎల్‌నినో పరిస్థితి వాస్తవమని, ప్రతి సంక్షోభాన్ని అవకాశంగా మలుచుకోవాలని అన్నారు. రాష్ట్రంలో 132 లక్షల ఎకరాల సాగు లక్ష్యానికి గాను ఇప్పటివరకు 55 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగు జరిగిందన్నారు. జిల్లాలోని నీటి వనరుల పరిస్థితిని పరిశీలించి పంటల వైవిధ్యీకరణను విస్తృతంగా ప్రోత్సహించాలని, ఆయిల్‌పామ్, ఉద్యాన పంటలు, పట్టు పరిశ్రమకు అనుకూల పంటలు, తక్కువ నీటితో సాగయ్యే పంటలను ప్రోత్సహించాలని సూచించారు. ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలని, రైతులకు వాస్తవ పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలియజేస్తూ అవగాహన కల్పించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. సంబంధిత అధికారులతో జిల్లాలోని నీటి లభ్యత, పంటల సాగు పరిస్థితులను సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేత

- కాంగ్రెస్ పార్టీ నాయకుడు లీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 9(జన సంఘర్షణ)



మెదక్ జిల్లా చిన్న శంకరంపేట మండలం టి మాందాపూర్ గ్రామానికి చెందిన అంగడి పెద్ద నర్సింలు హార్ట్ ఎటాక్ రావడంతో అకస్మాత్తుగా మరణించారు. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితిని గమనించి ఇట్టి సమాచారాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకుడు లీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్‌కి తెలియజేయగా వారి ఊరికి చేరుకొని కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి 5,000 రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాణి గణేష్, తాండ సర్పంచ్ అశోక్,ఉప సర్పంచ్ లాలు, చంద్రం, సిద్ధ గౌడ్, నారాయణ, వార్డు మెంబర్ శివకుమార్, బాలు, యాదగిరి, జి పి పాలకవర్గ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఐటిఐ/ఎటిసిలలో ప్రవేశాలకు దరఖాస్తుల గడువు జూలై 10 వరకు పొడిగింపు

- మెదక్ ఐటిఐ ప్రిన్సిపల్ శ్రీనివాస్.



ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధిజూలై 9(జన సంఘర్షణ)
మెదక్ జిల్లాలోని మెదక్ ప్రభుత్వ పారిశ్రా మిక శిక్షణ సంస్థ (ఐటిఐ), ఎటిసిలలో 2026--27 విద్యా సంవత్సర ప్రవేశాలకు దరఖాస్తుల గడువును జూలై 10 వరకు పొడిగిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ఉపాధి శిక్షణ శాఖ నిర్ణయం తీసుకుందని మెదక్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ గుమ్మకొండ శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంతవరకు దరఖాస్తు చేసుకోని విద్యార్థులు వెంటనే ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని, 8వ తరగతి లేదా 10వ తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలని, https://iti.telangana.gov.in వెబ్సైట్ ద్వారా జూలై 10వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని, అభ్యర్థులు తమ ఎస్ఎస్సీ మెమో, కుల ధ్రువీకరణ పత్రం, బోనాఫైడ్ వంటి అన్ని సర్టిఫికేట్లను స్పష్టంగా స్కాన్ చేసి అప్లోడ్ చేయాలని ఆధార్లో పేరు పుట్టిన తేదీ ఎస్ఎస్సీ మెమో ప్రకారం ఉండాలని సూచించారు. 1.ఎలక్ట్రిషియన్, 2.ఫిట్టర్, 3.మెకానిక్ డీజిల్, 4.డ్రాఫ్ట్మన్ సివిల్, 5.కోపా, ఎటిసి ట్రేడ్లు 1.ఇంజనీరింగ్ డిజైన్ టెక్నీషియన్, 2.సీఎన్సీ మెషినింగ్ టెక్నీషియన్, 3.ఇండస్ట్రియల్ రోబోటిక్స్ డిజిటల్ మాన్యు ఫాక్చరింగ్ టెక్నీషియన్,4.మాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమే షన్, 5.మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్, 6.వర్చువల్ అనాలిసిస్. కోర్సులు అందుబాటులో ఉన్నాయని, అభ్యర్థులు ఎక్కువ సంఖ్యలో ట్రేడ్లు, ఐటీఐలను ఆప్షన్లుగా ఎంపిక చేసుకోవాలని, మరింత సమాచారం కోసం కార్యాలయ పని వేళల్లో ఉదయం 10:00 నుండి సాయంత్రం 5:00 వరకు నేరుగా ప్రభుత్వ ఐటిఐ/ఎటిసి, మెదక్ కార్యాలయాన్ని సంప్రదించవచ్చునని మెదక్ ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపల్ గుమ్మకొండ శ్రీనివాసులు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ప్రతి విద్యార్థినికి అండగా 'పోలీస్ అక్క

- భయపడొద్దు' పోలీస్ అక్క'ను ఆశ్రయించండి.
- విద్యార్థినుల భద్రతకు 'పోలీస్ అక్క' అండగా నిలుస్తుంది.
- జిల్లా ఎస్పీడి.వి. శ్రీనివాసరావు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 9 (జన సంఘర్షణ)



విద్యార్థినుల్లో భద్రతా భావన పెంపొందించడం, మహిళల రక్షణపై అవగాహన కల్పించడం, వారికి స్నేహపూర్వక పోలీసు సేవలు అందించాలనే లక్ష్యంతో తెలంగాణ పోలీసు శాఖ చేపట్టిన 'పోలీస్ అక్క' కార్యక్రమాన్ని మెదక్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..ప్రతి విద్యాసంస్థలో విద్యార్థినులకు భరోసాగా నిలవడమే 'పోలీస్ అక్క' కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. విద్యార్థినులు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా భయపడకుండా 'పోలీస్ అక్కను సంప్రదించాలని సూచించారు. మహిళలు, బాలికల భద్రతకు తెలంగాణ పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి ఫిర్యాదును సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పోలీస్ అక్క' విద్యాసంస్థలను క్రమం తప్పకుండా సందర్శిస్తూ విద్యార్థినులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుంటారని తెలిపారు. మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, బాల్య వివాహాల నివారణ, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, మహిళల రక్షణకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. అవసరమైన సందర్భాల్లో బాధితులకు పోలీసు, న్యాయపరమైన సహాయం అందేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తూ, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించి సహాయం అందించడం 'పోలీస్ అక్క' ప్రధాన బాధ్యతలని వివరించారు. సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు, ఓటీపీలు, బ్యాంకు సమాచారం పంచుకోవద్దని విద్యార్థినులకు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్--112, షీ టీమ్స్, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్--1930 సేవలనువినియోగించుకోవాలని తెలిపారు. విద్యార్థినులు ఆత్మవిశ్వాసంతో చదువుకొని జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలని, ఎలాంటి సమస్య ఎదురైనా దాచిపెట్టకుండా తల్లిదండ్రులు, అధ్యాపకులు లేదా 'పోలీస్ అక్కకు తెలియజేయాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, కళాశాల ప్రిన్సిపాల్, సీఐలు రేణుక, కృష్ణమూర్తి, పోలీసు సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# అంత్యోదయ కార్డును రద్దు చేసే విధానాన్ని విరమించుకోవాలి

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 9 (జన సంఘర్షణ)



అంత్యోధయ కార్డు రద్దును విరమంచుకోవలని మెదక్ జిల్లా కేంద్రంలో పోస్ట్ ఆఫీస్ చౌరస్తా వద్ద సిఐటియు వ్యవసాయ కార్మిక సంఘం రైతు సంఘం వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు సంతోష్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కే మల్లేశం మాట్లాడుతూ దేశంలో ని 80 కోట్ల మంది తెల్ల రేషన్ కార్డులు కలిగి ఉన్నారని అన్నారు. దేశంలో సుమారుగా 35 కోట్ల మంది అంత్యోదయ కార్డులు ఉన్నాయని అన్నారు. మెదక్ జిల్లాలో 213873 తెల్ల రేషన్ కార్డులు జిల్లాలో 13,857 అంతదయ్య కార్డులు కలిగి ఉన్నారని తెలిపారు.మెదక్ జిల్లాలో సుమారుగా 15000 కుటుంబాలు 35 కిలోల బియ్యాన్ని నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో అందరికీ అన్నం పెడతామని గొప్పలు చెబుతున్న బిజెపి అంథోదయ కార్డులను రద్దు చేయడం దుర్మార్గం అని పేర్కొన్నారు. ఆహార భద్రత చట్టం ప్రకారం అందరికీ పేదలకు అన్నం పెట్టాలని చట్టంలో ఉందని వివరించారు. చట్టం ప్రకారం పేదలకు అన్నం పేట్టే విధానాన్ని పెంచాలని డిమాండ్ చేశారు.దేశంలో జనాభా ప్రకారం అందరికీ అన్నం పెట్టే ఆహార భద్రత చుట్టాన్ని సవరించడం న్యాయం కాదని దయ్యాపట్టారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పేదలను గుర్తించి కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు, వికలాంగుల సంఘం జిల్లా నాయకులు కె.కవిత, వై దుర్గ, రైతు సంగం సిహెచ్ బచ్చా గౌడ్, రాణి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# యువతిని తీసుకువెళ్లిన వారిపై కేసు నమోదు..

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 9 (జన సంఘర్షణ)




ప్రేమించి వివాహం చేసుకున్న యువతిని అత్తగారింటి నుంచి బలవంతంగా తీసుకువెళ్లిన యువతి తరపు వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం...పాపన్నపేట మండలం ఎల్లాపూర్ గ్రామానికి చెందిన యువకుడు, కౌడిపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిని ప్రేమ వివాహం చేసుకొని ఈనెల 6న పాపన్నపేట పోలీసు స్టేషన్ కు వచ్చారు. ఇద్దరు మేజర్ లుకావడంతో పోలీసులుకౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం యువకుడు యువతిని తీసుకొని ఎల్లాపూర్ లోని ఇంటికి వెళ్లాడు. బుధవారం యువతి తరపు వారు ఎల్లాపూర్ లోని యువకుడి ఇంటికి వచ్చి ఇంట్లో ఉన్న యువతిని బయటకు తీసుకువచ్చారు. అడ్డు వచ్చిన యువకుడి కుటుంబీకులను తప్పించి యువతిని బలవంతంగా కారులో ఎక్కించుకొని తీసుకువెళ్లడంతో యువకుడు ఈ మేరకు యువకుడు ఠాణాలో ఫిర్యాదు చేయగా యువతి తరపు వారు ఐదుగురిపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఇదిలా ఉండగా గురువారం మెదక్ సీఐ కార్యాలయంలో యువతి, యువకుడికి కౌన్సిలింగ్ ఇచ్చారు. యువతి ఇష్టం మేరకు ఆమెను యువకుడికి అప్పగించారు.

# లిఫ్ట్ పనుల్లో విద్యుత్ షాక్

- ఒకరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు



నిజామాబాద్ /జూలై 9/(జన సంఘర్షణ)
విద్యుత్ షాక్కు గురై ఓ యువకుడు మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డ ఘటన నిజామాబాద్ నగర శివారులోని బోర్గం (పి) గ్రామ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. భూమ్ రెడ్డి కన్వెన్షన్కు చెందిన కమర్షియల్ కాంప్లెక్స్‌లో లిఫ్ట్ నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. భూమ్ రెడ్డి లిఫ్ట్ నిర్మాణ పనులను ఓ గుత్తేదారుకు అప్పగించారు. గురువారం సాయంత్రం గుత్తేదారు ఇద్దరు కూలీలను తీసుకువచ్చి లిఫ్ట్ పనులు చేయిస్తుండగా ప్రమాదం జరిగింది. ఈ క్రమంలో సమీపంలోని 33/11 కేవీ విద్యుత్ వైర్లు తగలడంతో కూలీలు విద్యుత్ ఘాతానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో కిరణ్ (30) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తి దీపక్ తీవ్రంగా గాయపడగా, అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న నాలుగో టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. విద్యుత్ షాక్కు గురైన ఇద్దరినీ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే కిరణ్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై నాలుగో టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి గల కారణాలు, నిర్లక్ష్యం అంశాలపై పోలీసులు విచారణ చేపడుతున్నారు.

## పోలీస్ అక్క కార్యక్రమంలో భాగంగా చేపట్టనున్న ముఖ్య కార్యక్రమాలు

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై9(జన సంఘర్షణ)

- పాఠశాలలో విద్యార్థినులతో కలిసి భోజనం చేసి, అవసరమైన సందర్భాల్లో రాత్రి అక్కడే బస చేస్తారు.
- విద్యార్థినులతో మమేకమై స్నేహపూర్వక వాతావరణంలో సమయం గడుపుతూ వారి విశ్వాసాన్ని పెంపొందిస్తారు.
- మహిళల భద్రత, మహిళా రక్షణ చట్టాలు, విద్యార్థినుల హక్కులపై అవగాహన కల్పిస్తారు.
- సైబర్ నేరాల నివారణ, సురక్షిత సోషల్ మీడియా వినియోగంతో పాటు గుడ్ టచ్
- బ్యాడ్ టచ్ అంశాలపై అవగాహన కల్పిస్తారు.
- చదువుపై ఆసక్తి, ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వ వికాసం పెంపొందేలా ప్రేరణాత్మక సూచనలు అందిస్తారు.
- విద్యార్థినుల సమస్యలు, సందేహాలు, భవిష్యత్తు లక్ష్యాలను తెలుసుకుని అవసరమైన మార్గదర్శకత్వం అందిస్తారు.
- అవసరమైన సందర్భాల్లో సంబంధిత అధికారులతో సమన్వయం చేసి విద్యార్థినుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారు.
- విద్యార్థినులతో స్నేహపూర్వకంగా మెలుగుతూ వారికి మానసిక ధైర్యం, భరోసా కల్పిస్తారు.
- ఉదయం యోగా, శారీరక వ్యాయామాలు నిర్వహించి ఆరోగ్యకరమైన జీవనశైలిపై అవగాహన కల్పిస్తారు.
- విద్యార్థినుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, దేశభక్తి విలువలు పెంపొందేలా నిరంతరం ప్రోత్సహిస్తారు.

## బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొల్కూరి లక్ష్మారెడ్డిని పరామర్శించిన మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 9 (జన సంఘర్షణ)



ఇటీవల అనారోగ్యానికి గురైన శంకరంపేట(ఆర్) మండలానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కొల్కూరి లక్ష్మారెడ్డిని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి గురువారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. లక్ష్మారెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నరు. వైద్యుల సూచనల మేరకు చికిత్స కొనసాగిస్తూ పూర్తి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఆయన త్వరగా కోలుకుని మునుపటిలాగే పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. అలాగే ధైర్యంగా ఉండాలని సూచిస్తూ మనోధైర్యం కల్పించారు.ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పట్లూరి రాజు, మాజీ సర్పంచ్‌లు మంచాల లక్ష్మణ్, సుల్ల దయానంద్ యాదవ్, పడాల శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి,మండల నాయకులు రామ్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మహేందర్, ధర్మారెడ్డి, సంజీవ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## దళిత క్రైస్తవ రిజర్వేషన్ సమలోచన సభ

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 9 (జన సంఘర్షణ)






- వడ్లూర్ లక్ష్మణ్ కుమార్ (రాష్ట్ర సాంఘిక సంక్షేమ మంత్రి )
- అజరుద్దీన్ ( మైనార్టీ శాఖ మంత్రి)
- దీపక్ జాన్ (క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ )
- బిషప్ గొల్లపల్లి జాన్ ( జేఏసీ చైర్మన్ )
- డాక్టర్ ఖాసీం ( ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ )
- డి.రాజేశ్వరరావు ( మాజీ ఎమ్మెల్సీ)
- ఓరుగంటి ఆనంద్ ( రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ మెంబర్ )

-రెవ.మోహన్ బాబు ( సభా అధ్యక్షులు)

-రెవ. డాక్టర్ సొలోమోన్ ( క్రిస్టియన్ అడ్వైజర్ కమిటీ)

శ్రీ బాబురావు ( రిటైర్ డిజిపి స్టేట్ క్రిస్టియన్ అడ్వైజర్ కమిటీ )

- బిషప్ సింగం విల్సన్,
- రెవ. ప్రసాద్ చౌదరి
- బ్రదర్. బెనర్జీ( రక్షణ టీవీ)
- గోనె సొలోమోన్ ( టి యు పి ఎ స్టేట్ జనరల్ సెక్రెటరీ,
- బిషపులు, జంట నగరాల సీనియర్ దైవజనులు , 33 జిల్లాల పాస్టర్స్, ప్రతినిధులు, క్రైస్తవ ఉద్యమ సంఘాల నాయకులు పాల్గొని చర్చించారు.ఆర్టికల్ 14 సమానత్వపు హక్కు

ఆర్టికల్ 15 వివక్షత నిషేధం. ఆర్టికల్ 16 ఉద్యోగ సమాన అవకాశాలు.

ఆర్టికల్ 25 మత స్వేచ్ఛ బవ ప్రకటన ప్రకటించే హక్కు, విద్య సంస్థలు, వైద్య సంస్థలు నెలకొల్పే హక్కు, మందిరముల నిర్మాణము పలువిధములైన అంశాల పైన చర్చించడం జరిగింది. రాహుల్ గాంధీ కాంగ్రెస్ నాయకత్వం, సీఎం రేవంత్ రెడ్డి దళిత క్రైస్తవుల హక్కుల పక్షాన అనుకూలంగా ఉన్నారు. క్రైస్తవ సమాజం కృతజ్ఞతలు తెలియజేస్తూ ప్రార్థనలు చేయడం జరిగినది. క్రైస్తవులకు వ్యతిరేకంగా ఉన్న ఏ ఆయుధము, శాసనములు శాసనములు,చట్టములు వర్ధిల్లావు.ఎస్తేరు,నెహెమ్యా , షద్రక్, మెసేక్, అబేశీదోన్నగో, దానియేలు లాగా ప్రార్థన చేద్దాం. క్రైస్తవులకు సాధ్యం కానిది ఏది లేదు. జేఏసీ, దళిత క్రైస్తవుల హక్కుల ఉద్యమంలో ప్రార్థన పూర్వకంగా సాగుదాం. బిషప్ డా"దాస్ ఎల్లం.. ( ప్రైమ్ మినిస్టర్ న్యూ 15.ప్రోగ్రాం జేఏసీ రాష్ట్ర నాయకులు.)

# 3వ జోనల్ పోలీస్ డ్యూటీ మీట్‌లో మెదక్‌కు పతకాల పంట

- **విజేతలను అభినందించిన జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 9 (జన సంఘర్షణ)



కరీంనగర్‌లో జులై 7, 8 తేదీల్లో నిర్వహించిన 3వ జోనల్ పోలీస్ డ్యూటీ మీట్-2026లో మెదక్ జిల్లా పోలీసులు ప్రతిభ చాటుతూ మొత్తం 8 పతకాలు సాధించారు. ఈ సందర్భంగా గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో విజేతలను జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. డ్యూటీ మీట్‌లు పోలీసు సిబ్బంది వృత్తి నైపుణ్యాలను మెరుగుపర్చేందుకు ఎంతో దోహదపడతాయని అన్నారు. విధి నిర్వహణలో నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు పెంచుకుంటూ రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ మెదక్ జిల్లా ప్రతిష్ఠను నిలబెట్టాలని సూచించారు. పోటీల్లో ట్రాకింగ్ విభాగంలో మహేష్, నార్కోటిక్స్ విభాగంలో శ్రావణ్, యాక్సెస్ కంట్రోల్, కంప్యూటర్ అవేర్‌నెస్, ఆఫీస్ ఆటోమేషన్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ విభాగాల్లో సతీష్ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. అలాగే పోలీస్ వీడియోగ్రఫీ, ఫోటోగ్రఫీ విభాగంలో శ్రీధర్ విజేతగా నిలిచారు. వివిధ విభాగాల్లో సాధించిన ఈ విజయాలతో మెదక్ జిల్లా ఖాతాలో మొత్తం 8 పతకాలు చేరాయి. విజేతలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి, ఇదే స్ఫూర్తితో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణించి జిల్లా పోలీసు శాఖకు మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

## 15 క్వింటాళ్ల రేషన్ బియ్యం

నిజామాబాద్/జులై 9/(జన సంఘర్షణ)



స్వాధీపేదల కోసం ప్రభుత్వం పంపిణీ చేసే రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచిన ఘటనపై సీసీఎస్ పోలీసులు మెరుపుదాడి చేశారు. 5వ టౌన్ పరిధిలోని అజమ్ కాలనీలో సీసీఎస్ ఏసీపీ శ్రీశైలం పర్యవేక్షణలో ఇన్స్పెక్టర్ సాయినాథ్, ఎస్ఐ మహేష్ బృందం ఈ దాడి చేసి 15 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో ఒకరిని అదుపులోకి తీసుకోగా, మరో నిందితుడు మోసిన్ పరారీలో ఉన్నాడు. నిందితులపై కేసు నమోదు చేసి 5వ టౌన్ పోలీసులకు అప్పగించినట్లు అధికారులు తెలిపారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## పాత నేరస్థులపై నిఘా..

- **అక్రమ కార్యకలాపాలపై ఉక్కుపాదం**

నిజామాబాద్/జులై 9/(జన సంఘర్షణ)



నిజామాబాద్ డివిజన్ అధికారులతో సిపి సమీక్ష సమావేశం.. నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్ డివిజన్లో శాంతిభద్రతల పరిరక్షణ, పెండింగ్ కేసుల పరిష్కారం, నేరాల నియంత్రణపై పోలీస్ కమిషనర్ సాయిచైతన్య గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు.పోలీసు కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విధి నిర్వహణలో అధికారులు, సిబ్బంది అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు రాబోయే పండుగల దృష్ట్యా నిజామాబాద్ డివిజన్లో బందోబస్తును పటిష్టం చేయాలని కమిషనర్ సూచించారు.

## ఓటరు సవరణ కార్యక్రమాన్ని ఐదవ వార్డులో పరిశీలించిన ఆర్డీవో ఎమ్మార్వోలు

- **ఐదవ వార్డు కౌన్సిలర్ మామిళ్ళ ఆంజనేయులు తెలిపారు.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 9 (జన సంఘర్షణ)



మెదక్ పట్టణం 5వ వార్డులో ఎస్ఐఆర్ ఓటరు సవరణ కార్యక్రమాన్ని పరిశీలించిన ఆర్డీవో రమాదేవి, ఎమ్మార్వో లక్ష్మణ్ బాబు మెదక్ పట్టణంలోని 5వ వార్డులో జరుగుతున్న ఎస్ఐఆర్ ఓటరు సవరణ కార్యక్రమాన్ని మెదక్ ఆర్డీవో రమాదేవి, ఎమ్మార్వో లక్ష్మణ్ బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక కౌన్సిలర్, బీఆర్ఎస్ మెదక్ పట్టణ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు, కో-ఆప్షన్ సభ్యులు మహమ్మద్ తాహిర్, మాజీ కో-ఆప్షన్ సభ్యులు సాదిక్, బీఎల్ఓ శైలజతో కలిసి వార్డులో కొనసాగుతున్న ఓటరు నమోదు, సవరణ ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించి ఓటర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆర్డీవో రమాదేవి మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ప్రతి అర్హత కలిగిన ఓటరు సకాలంలో పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో ప్రతి ఓటుకు ఎంతో విలువ ఉందని, ఓటరు జాబితాలో తమ వివరాలను పరిశీలించి అవసరమైన సవరణలు, నమోదులు వెంటనే పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఎమ్మార్వో లక్ష్మణ్ బాబు మాట్లాడుతూ..ఓటరు సవరణ కార్యక్రమం విజయవంతం కావడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, బీఎల్ఓలు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా సహకరించి తమ ఓటరు వివరాలను సరిచేసుకోవాలని కోరారు. స్థానిక కౌన్సిలర్, బీఆర్ఎస్ మెదక్ పట్టణ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు మాట్లాడుతూ.. 5వ వార్డులో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో విజయవంతం చేసేందుకు ప్రజలకు అవసరమైన సహాయం అందిస్తున్నామని తెలిపారు. ప్రతి అర్హత కలిగిన ఓటరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటరు నమోదు, సవరణ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.కో-ఆప్షన్ సభ్యులు మహమ్మద్ తాహిర్, మాజీ కో-ఆప్షన్ సభ్యులు సాదిక్ మాట్లాడుతూ,వార్డులో ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ఎస్ఐఆర్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనేలా చైతన్యపరుస్తున్నామని తెలిపారు.

# ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలి

- **గ్రామ పంచాయతీల ఆదాయ వనరులను పెంచుకోవాలి.**
- **గ్రామ పంచాయతీ - సమగ్ర అభివృద్ధి ప్రణాళికతో మూడేళ్ల అభివృద్ధికి కార్యాచరణ రూపొందించాలి.**
- **జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 9 (జన సంఘర్షణ)



గ్రామ పంచాయతీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్‌లి అన్నారు.గ్రామ పంచాయతీ--సమగ్ర అభివృద్ధి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మీటింగ్ హాల్లో మెదక్ నియోజకవర్గానికి చెందిన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకుని చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటివరకు జిల్లాలో వివిధ అభివృద్ధి పనులకు మంజూరైన నిధులతో చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. గ్రామ వనరులను వినియోగించుకుని ఆదాయాన్ని పెంచుకోవాలి. ప్రతి గ్రామ పంచాయతీ తమ పరిధిలో ఉన్న సహజ వనరులు, స్థానిక ఆదాయ మార్గాలను గుర్తించి పంచాయతీ ఆదాయాన్ని పెంచుకునే విధంగా ప్రణాళికలురూపొందించుకోవాలని అన్నారు. గ్రామ పంచాయతీలు ఆర్థికంగా బలోపేతం అయితేనే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యత. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను యుద్ధ ప్రాతిపదికన నిర్వహించాలని ఆదేశించారు. గ్రామ సభల్లో ప్రజల నుంచి వచ్చిన ప్రధాన సమస్యలను ప్రతి గ్రామ పంచాయతీ గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ రాబోయే మూడు సంవత్సరాల కాలానికి గ్రామ పంచాయతీ-సమగ్ర అభివృద్ధి ప్రణాళిక ను రూపొందించుకోవాలని సూచించారు. ప్రణాళిక తయారీలో ప్రధానంగా ఏడు అంశాలపై వివిధ శాఖలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరించుకోవాలని తెలిపారు. ఘన వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి. ఘన వ్యర్థాల నిర్వహణ ప్రతి ఇంటి నుంచి ప్రారంభం కావాలన్నారు. ఇంటి వద్దనే చెత్తను వేరు చేసే విధానాన్ని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. చెత్త సేకరణ సమయంలో తడి చెత్త, పొడి చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు, తదితరాలను వేర్వేరుగా సేకరించి శాస్త్రీయ పద్ధతిలో పారవేయాలని తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి గ్రామాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి ఇంటిలో మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా ఉండేలా పర్యవేక్షించాలని సూచించారు. జీ రామ్ జీ పథకం ద్వారా ఉపాధి కల్పన. జీ రామ్ జీ పథకంలో భాగంగా జాబ్ కార్డు కలిగిన ప్రతి గ్రామీణ పేద కుటుంబానికి 125 రోజుల పని దినాలు తప్పనిసరిగా కల్పించాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెంచడంతో పాటు కుటుంబాల ఆర్థిక స్థితి మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే గ్రామాల్లో మహిళా సంఘాల కార్యకలాపాలకు ఉపయోగపడే వీఓ భవనాల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక కేవలం పత్రాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలు జరిగేలా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి విద్యారావ్ జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీపీఓ యాదయ్య, మిషన్ భగీరథ ఈ.ఈ సంపత్ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

# మన్న నూర్ ఎస్టీ గురుకుల పాఠశాలలో విద్యార్థులు అస్వస్థత

- కిచిడి తిన్న తర్వాత కడుపునొప్పి వాంతులతో ఇబ్బందుల పాలైన విద్యార్థులు
- అచ్చంపేట ఆసుపత్రిలో చికిత్సలు
- 26 మంది విద్యార్థులు వాంతులు, విరోచనాలతో బాధపడుతూ ఉన్నవారికి ఆసుపత్రిలో చికిత్స

అచ్చంపేట/జూలై 9/(జన సంఘర్షణ)

వసతి గృహాల్లో, గురుకుల పాఠశాలలో, బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు, పౌష్టికాహారం అందించడానికి కోట్ల రూపాయలు బడ్జెట్లో పెట్టడం జరిగిందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడ బహిరంగ సభలు జరిగిన ముందు చెప్పేది ఈ విషయాలే. కానీ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పే మాటలకు క్షేత్రస్థాయిలో జరుగుతున్న సంఘటనలకు ఎలాంటి తేడా లేకుండా ఉంది. వారం రోజుల క్రితం కామారెడ్డి జిల్లా బీర్కూర్ బాలుర గురుకుల పాఠశాలలో 20 మంది విద్యార్థులు కలుషిత ఆహారం తిని ఆసుపత్రి పాలయ్యారు. ఈ ఘటన మర్చిపోకముందే నాగర్కర్నూల్ జిల్లాలో ఇలాంటి కట్టండి చోటుచేసుకుంది. నాగర్ కర్నూల్ జిల్లా మన్ననూర్ ఎస్టి గురుకుల పాఠశాలలో విద్యార్థులు అస్తస్తత్వం గురై ఆసుపత్రి పాలయ్యారు. గురుకుల పాఠశాల నిర్వాకులు, వసతి గృహాల నిర్వాకులు, బాలికల కస్తూర్బా పాఠశాల నిర్వాకులు నాసిరకం సరుకులు వాడటం వల్ల భోజనం చేసిన తర్వాత విద్యార్థులు అస్వస్థకు ఘటనలు వెలుగు చూస్తూనే ఉన్నాం. మన్నా నూర్ ఎస్టీ గురుకుల పాఠశాలలో గురువారం కిచిడి తిన్న విద్యార్థులు ఒకేసారి వాంతులు, కడుపు నొప్పితో బాధపడుతుండగా వెంటనే వారిని 108 అంబులెన్స్ లో అచ్చంపేట ఆసుపత్రికి తరలించారు. గురుకుల పాఠశాల నిర్వాకుల నిర్లక్ష్యం, అవినీతి, అక్రమాలు చోటు చేసుకోవడంతో నిరుపేద విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్నారు. స్థానిక అధికారులు ఎప్పటికప్పుడు సమయం దొరికినప్పుడల్లా వసతి గృహాలు, గురుకుల పాఠశాలలో ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడ జరుగుతున్న లోపాలను సరిచేయాల్సిన సరి చేయాల్సిన అధికారులు కాసులకు కక్కుర్తి పడుతూ ఇసుక మాఫియాకు, మొరం మాఫియా కు అండగా నిలుస్తున్నారు తప్ప విద్యార్థులకు వసతి గృహాల్లో ఏ విధమైన ఆహారం అందుతుందో పరిశీలించడంలో అధికారులు పూర్తిగా విఫ్లమైనారు. కలెక్టర్ వస్తున్న విషయాన్ని తెలుసుకొని ముందుగానే స్థానిక అధికారులు ఆ పాఠశాలలో ఎలాంటి లోపాలు లేకుండా సరిచేస్తున్నారు ఆ తర్వాత యధావిదం ఇదండీ మన తెలంగాణ రాష్ట్రంలో విద్యకు ఇస్తున్న ప్రాముఖ్యత. పేద విద్యార్థులు అండగా ఉండవలసిన వసతి గృహాలు వారి పాలిట శాపంగా మారాయి. తెలంగాణ రాష్ట్రంలో ఏదో ఒక జిల్లాలో పాఠశాలల్లో, గురుకుల పాఠశాలలో కలుషిత హారం తిని ఆసుపత్రి పాలైన ఘటనలు ఎన్నో వెలుగు చూస్తున్నాం. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి





కానీ, సంబంధిత శాఖ మంత్రులు గానీ వసతి గృహాలపై నిర్లక్ష్యం చెబుతున్న నిర్వాకులపై ఎక్కడ కూడా చర్యలు తీసుకుందా సందర్భాలు కనిపించడం లేదు. వసతి గృహాల్లో సమయానికి నిర్వాకులు అందుబాటులో ఉండకపోవడం. వంట గదిలో వంటలు చేస్తున్నా తీరును చూడకపోవడం పట్ల విద్యార్థులకు కలుషిత ఆహారం దిక్ అవుతుంది. మరి రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు ప్రకటనలు, వారి ఆదేశాలు చేస్తున్న వారిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# 2036 లో ఒలంపిక్ క్రీడలను నిర్వహించాలని భారతదేశం పోటీ పడుతున్న నేపథ్యంలో

- అక్కడ నిర్వాణకు తెలంగాణ ఆదిత్యం ఇవ్వాలన్న బలమైన ఆకాంక్షను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యక్తం చేశారు

హైదరాబాద్/జులై 9/(జన సంఘర్షణ)



2036లో ఒలింపిక్స్ క్రీడలను నిర్వహించాలని భారతదేశం పోటీ పడుతున్న నేపథ్యంలో ఆ క్రీడల నిర్వహణకు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వాలన్న బలమైన ఆకాంక్షను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యక్తం చేశారు. ఆ క్రీడల నిర్వహణకు అనుగుణంగా తెలంగాణ, హైదరాబాద్ నగరాన్ని అన్ని రకాలుగా సర్వసన్నద్ధం చేస్తున్నామని చెప్పారు. తెలంగాణ క్రీడా వైభవం నూతన అధ్యాయానికి ముఖ్యమంత్రిగ శ్రీకారం చుట్టారు. గచ్చీబౌలి స్టేడియం వేదికగా ముఖ్యమంత్రిగ, ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షురాలు పీటీ ఉష తో కలిసి గచ్చీబౌలి స్పోర్ట్స్ డిస్ట్రిక్ట్, యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీకి శు భారంభం పలికారు. మంత్రి వాకిటి శ్రీహరి , ప్రభుత్వ సలహాదారు (క్రీడలు) ఏపీ జితేందర్ రెడ్డి , ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు, క్రీడాభిమానులు, అధికారులు, విద్యార్థుల సమక్షంలో వాటికి శ్రీకారం చుట్టారు. క్రీడలను ప్రోత్సహించాలన్న బలమైన ఆకాంక్షతో స్పోర్ట్స్ యూనివర్సిటీని స్థాపించడం పట్ల ఈ సందర్భంగా పీటీ ఉష ముఖ్యమంత్రి కి, రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, వచ్చే నవంబర్లో ఖేలో ఇండియా పోటీలను నిర్వహించడమే కాకుండా 2036 ఒలింపిక్స్ నిర్వహించాలని భారతదేశం భావిస్తున్న నేపథ్యంలో అందుకు తెలంగాణ వేదిక కావాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. 82 ఎకరాల్లో అత్యాధునిక వసతులతో స్పోర్ట్స్ యూనివర్సిటీని, ప్రపంచ స్థాయి స్పోర్ట్స్ అకాడమీని ఇక్కడ నిర్మించబోతున్నాం. 2028 డిసెంబరులో ఆ స్పోర్ట్స్ యూనివర్సిటీని ప్రారంభించుకోబోతున్నాం అని తెలిపారు. క్రీడారంగంలో స్పష్టమైన విధానం లేని కారణంగా క్రీడల్లో దేశం వెనుకబడిపోయింది. అందుకే తెలంగాణలో స్పష్టమైన క్రీడా పాలసీని తెచ్చాం. దేశంలో క్రీడా శిక్షణా కేంద్రాలు, యూనివర్సిటీలకు పాలసీ ఉండాలి. స్వాతంత్ర్యోద్యమ కాలంలో యంగ్ ఇండియా పేరుతో మహాత్మాగాంధీ నడిపిన యంగ్ ఇండియా దినపత్రిక స్ఫూర్తిగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశాం అని వివరించారు. ఆఫ్రోఏషియన్ క్రీడలు, ప్రపంచ మిలిటరీ గేమ్స్, కామన్వెల్త్ గేమ్స్ నిర్వహణకు వేదికగా ఉన్న హైదరాబాద్ ఆ తర్వాత గడిచిన 20 ఏళ్లపాటు చెప్పుకోదగిన క్రీడలను నిర్వహించలేదు. 23 ఏళ్ల కిందట నిర్మించిన స్టేడియాలు ఆ తర్వాత పెళ్లిళ్లకు, రాజకీయ కార్యక్రమాలకు వేదికగా ఉపయోగించారు. వాటన్నింటినీ పునరుద్ధరించాలని భావిస్తున్నాం అని స్పష్టం చేశారు. నిజమైన క్రీడాకారులను సంపూర్ణమైన ప్రోత్సాహకాలను అందించడానికి స్పోర్ట్స్ పాలసీతో పాటు పబ్లిక్ - ప్రైవేట్ భాగస్వామ్యంలో క్రీడా యూనివర్సిటీని నెలకొల్పాం. ఇందులో ప్రభుత్వం జోక్యం ఉండదు. సంజయ్ గోయంకా, అభినవ్ బింద్రా, కపిల్ దేవ్, కావ్యా మారన్, ఉపాసన రామ్ చరణ్, రవికాంత్ రెడ్డి లాంటి క్రీడలను ప్రోత్సహిస్తున్న వారితో యూనివర్సిటీని ఏర్పాటు చేశాం. ఈ వర్సిటీ నిర్వహణ విషయంలో వారికే పూర్తి స్వేచ్ఛను ఇచ్చాం అని తెలిపారు. చదువులోనే కాదు, క్రీడల్లో రాణించినా భవిష్యత్తు బాగుంటుందని, క్రీడలపై దృష్టి సారించండి. క్రీడల్లో రాణించి దేశానికి ప్రతిష్ఠ తీసుకొస్తే అలాంటి వారికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చే బాధ్యతను తెలంగాణ తీసుకుంటుందని ప్రకటించారు. యువకులు ఈ దేశ సంపద. ఒలింపిక్స్, ఇతర క్రీడలు జరిగినప్పుడు ఏ దేశాలు ఎన్ని గెలిచాయని గమనించినప్పుడు భారతదేశం చివరిస్థానాల్లో నిలుస్తోంది. క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహించే విషయంలో పీటీ ఉష లాంటి వారు మాకు అవసరమైన సహకారం అందించాలి. పీటీ ఉష నుంచి




నేర్చుకోవలసింది చాలా ఉంది. క్రీడల్లో రాణించడం వల్లే ఈ రోజు రాజ్యసభ సభ్యులు కాగలిగారు అని చెప్పారు. ఏ రంగంలోనైనా ఉత్తమంగా రాణించాలంటే ఏకాగ్రత ఉండాలి. అప్పుడే రాణించగలుతాం. వందకు వంద శాతం సాధన చేయాలి. ఒకసారి ఓటమి చెందినంత మాత్రాన కుంగిపోవలసిన అవసరం లేదు. ఒక ఓటమి మనల్ని నిరాశపరచకూడదు. ఓటమిని సవాలుగా తీసుకోవాలి అని ముఖ్యమంత్రి ఉద్బోధించారు. వివిధ క్రీడల్లో విశేష ప్రతిభ కనబరిచిన తెలంగాణకు చెందిన ఆరుగురు క్రీడాకారులకు రూ. 7.15 కోట్ల మేరకు నగదు ప్రోత్సాహకాలను ఈ సందర్భంగా వారికి అందించారు. దీప్తి దివాంజీ (ప్యారా అథ్లెటిక్స్ చాంపియన్షిప్) కి రూ. 50 లక్షలు, దనుష్ శ్రీకాంత్ (షూటింగ్ - డెఫ్లింపిక్స్) కు రూ. 2.10 కోట్లు, ఈషా సింగ్ ( ప్రపంచకప్ విజేత - వరల్డ్ రికార్డు) కు రూ. 3.3 కోట్లు, నిఖత్ జరీన్ (బాక్సింగ్) కు రూ. 60 లక్షలు, తనిష్క్ మురలీధర్ నాయుడు (షూటింగ్) కు రూ. 53.65 లక్షలు, రావూరి సురభి భరద్వాజ్ (షూటింగ్) కు రూ. 10 లక్షల నగదు ప్రోత్సాహకాలకు సంబంధించి ముఖ్యమంత్రి చేతుల మీదుగా చెక్కులను అందించారు. రాబోవు రోజుల్లో తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనున్న టోర్నమెంట్స్, లీగ్స్ వివరాలను ఈ వేదికగా ప్రకటించారు. 2026 ఖేలో ఇండియా యూత్ గేమ్స్ (8వ ఎడిషన్) క్రీడలు, జాతీయ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్ టోర్నమెంట్స్ను తెలంగాణ నిర్వహించబోతోంది. వీటితో పాటు హాకీ ఇండియా లీగ్, ప్రపంచ పికిల్బాల్ లీగ్, ఆర్చరీ ప్రీమియర్ లీగ్, టెన్నిస్ ప్రీమియర్ లీగ్ పోటీలకు ఆతిథ్యం ఇవ్వనుంది. ఇదే సందర్భంగా ముఖ్యమంత్రి తెలంగాణ స్పోర్ట్స్ నాలెడ్జ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

# బిఆర్ఎస్ ఖాతాలో ఉన్న రూ.1400 కోట్ల సొమ్ము అమరవీరుల కుటుంబాలకు పంచాలి

- కేటీఆర్ క్విడ్ ప్రొ కో...

హైదరాబాద్/ జూలై 9/(జన సంఘర్షణ)

బీఆర్ఎస్ ఖాతాలో ఉన్న రూ. 1,400 కోట్ల సొమ్ము అమరవీరుల కుటుంబాలకు పంచాలి.కేటీఆర్ క్విడ్ ప్రొ కో ద్వారా అక్రమ పర్మిషన్లు కోట్లు కొల్లగొట్టిండు కాళేశ్వరం అవినీతిలో అనకొండ హరీశ్ రావు నేపార్టీని జోడెద్దుల మాదిరిగా నడపాల్సిన వాళ్లే అంబోతుల్లాగా సిగ్గు లేని వ్యవహారాలు చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర సేన అధ్యక్షురాలు కవిత ఆరోపించారు. అధికారంలో ఉన్న పదేళ్లలో క్విడ్ ప్రొ కో లో భాగంగా తన మిత్రుడు ప్రదీప్ కన్ స్ట్రక్షన్ కు అక్రమంగా పర్మిషన్లు ఇచ్చి పెద్ద భవనాలు కట్టుకునే అవకాశం ఇచ్చాడు. ఫినిక్స్ సంస్థకు 80 వేల కోట్ల విలువైన భూములు కట్టబెట్టారు. వాడు ఆంధ్రావాడా? తెలంగాణ వాడా? ఆ సంస్థ వాడు 33 లక్షల టన్నుల కలప కొట్టేస్తున్నాడు. ఫారెస్ట్ డిపార్ట్ మెంట్ పెట్టిన కేసులను కూడా మళ్లీ పట్టించడం లేదుపార్టీని జోడెద్దుల మాదిరిగా నడపాల్సిన వాళ్లే అంబోతుల్లాగా సిగ్గు లేని వ్యవహారాలు చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర సేన అధ్యక్షురాలు కవిత ఆరోపించారు.



# మెదక్ కలెక్టరేట్ కార్యాలయంలో యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ ప్రారంభోత్సవాన్ని వర్చువల్ పద్ధతిలో వీక్షించిన మెదక్ క్రీడా శాఖ అధికారులు

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 9: (జన సంఘర్షణ)



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నేడు ప్రారంభించిన యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ కార్యక్రమాన్ని వర్చువల్ పద్ధతిలో మెదక్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా క్రీడా అధికారులు వీక్షించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాజు,జిల్లా యువజన, క్రీడల అధికారి రమేష్ గంగాల, యస్.జి.యప్. కార్యదర్శి నాగరాజు, ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని నీలిమ, డి.పి.ఆర్.ఓ.రామచంద్ర రాజు, మున్సిపల్ ఆఫీస్ మేనేజర్ భవానీ, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి మధు సూదన్, వ్యాయామ ఉపాధ్యాయులు మాధవరెడ్డి, ప్రతాప్ సింగ్, వినోద్, దేవేందర్ రెడ్డి, రవి, ప్రభాకర్, మనోహర్, మంజుల, ఆఫ్రిన్, తదితరులు పాల్గొన్నారు.

# బంగారు గుండ్ల కోసం వృద్ధురాలిని హత్య చేసిన నిందితుడికి జీవిత ఖైదు

- రూ.6 వేల జరిమాన.
- శిక్ష పడేందుకు కృషి చేసిన సిబ్బందిని అభినందించిన మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు.




ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 9 (జన సంఘర్షణ)

మెదక్ జిల్లా టేక్మాల్ మండలం ఖాద్లూర్ గ్రామానికి చెందిన శివకుమార్ (28) బంగారు గుండ్ల కోసం ఓ వృద్ధురాలిని గొంతు పిసికి హత్య చేసిన కేసులో జిల్లా న్యాయస్థానం జీవిత ఖైదుతో పాటు రూ.6 వేల జరిమానా విధించినట్లు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం ఖాద్లూర్ గ్రామ శివారులోని దత్తాత్రేయ ఆశ్రమాన్ని నిర్వహిస్తూ 75 ఏళ్ల అంజమ్మ ఒంటరిగా నివసించేది. ఆమె మేనల్లుడు రాములు ప్రతిరోజూ ఆమెకు భోజనం తీసుకెళ్లేవాడు. 2024 ఆగస్టు 7న రాత్రి సుమారు 10:20 గంటలకు విధులు ముగించుకొని అంజమ్మను చూడడానికి వెళ్లిన రాములు ఎంత పిలిచినా స్పందన లేకపోవడంతో లోపలికి వెళ్లి చూడగా ఆమె మృతదేహంగా కనిపించింది. అదే సమయంలో గుడిసెలో ఒక మూలన దాక్కొని ఉన్న శివకుమార్ను గుర్తించిన రాములు, “ఇక్కడ ఏమి చేస్తున్నావు?” అని ప్రశ్నించగా, శివకుమార్ కర్రతో దాడి చేయడానికి ప్రయత్నించాడు.రాములు తప్పించుకోగా,నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. అనంతరం జరిగిన దర్యాప్తులో అంజమ్మను గొంతు పిసికి హత్య చేసి, ఆమె ధరించిన బంగారు గుండ్లను అపహరించినట్లు తేలింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు టేక్మాల్ ఏఎస్ఐ దయానంద్ కేసు నమోదు చేశారు. దర్యాప్తు అధికారులు సీఐలు రాజశేఖర్ రెడ్డి, రేణుక రెడ్డి సమగ్రంగా విచారణ చేపట్టి పక్కా సాక్ష్యాధారాలను సేకరించి న్యాయస్థానంలో చార్జ్షీట్ దాఖలు చేశారు. విచారణ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేష్ బలమైన వాదనలు వినిపించారు. పూర్తి సాక్ష్యాధారాలను పరిశీలించిన మెదక్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ నిందితుడు శివకుమార్ను దోషిగా తేల్చి జీవిత ఖైదుతో పాటు రూ.6 వేల జరిమానా విధించినట్లు మెదక్ జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో టేక్మాల్ ఎస్ఐ అరవింద్, లైజనింగ్ అధికారి ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ రవీందర్ గౌడ్, సీడీఓ కృష్ణ సహకరించారు. ఈ కేసును విజయవంతంగా దర్యాప్తు చేసి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన దర్యాప్తు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్, పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు అభినందించారు.

# బోధన్ ప్రజల ప్రాణాలతో మున్సిపల్ శాఖ నిర్లక్ష్యం

- ఏత్తోండ రాజేందర్..



బోధన్/జూలై 9/(జన సంఘర్షణ)



బోధన్ నుంచి చెక్కి క్యాంప్ దారిలో మూల మలుపు వద్ద ముళ్ళ కంపలు రోడ్డుపైన వచ్చి ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక ప్రమాదాలు నిత్యం జరుగుతున్నాయి కనుక సంబంధిత మున్సిపల్ శాఖ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా స్పందించక పోవడంతో నిజామాబాద్ పార్లమెంట్ తెలుగు యువత బోధన్ ఇంచార్జ్ ఏత్తోండ రాజేందర్ తీవ్ర అసహనం వ్యక్తం చేయడం జరిగింది ఇట్టి విషయాన్ని బోధన్ సబ్ కలెక్టర్ మరియు నిజాంబాద్ జిల్లా కలెక్టర్ గారి దృష్టికి తీసుకెళ్తానని ఆయన ఈ సందర్భంగా కోరారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
శుక్రవారం
10 జులై 2026

# ఎల్-నినో ప్రభావంపై మంత్రులతో వీడియో కాన్ఫరెన్స్

❑ వరి విస్తీర్ణం తగ్గించి ఆరుతడి పంటల వైపు వెళ్లాలని కలెక్టర్ సూచన

కామారెడ్డి బ్యూరో/జూలై 9/(జన సంఘర్షణ)

రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి , వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు ఆధ్వర్యంలో అన్ని జిల్లాల కలెక్టర్లు , సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. "ఎల్-నినో" ప్రభావం కారణంగా వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై దిశా నిర్దేశం చేశారు.వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ.. పంటల మార్పు జిల్లాలో నీటి ఆవశ్యకత అధికంగా ఉన్న వరి పంట విస్తీర్ణాన్ని తగ్గించాలని సూచించారు. రైతులు ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని కోరారు.
ఆరుతడి పంటలు: మొక్కజొన్న, సోయా, పెసర్లు, అలసందలు, మినుములు, కందులు, పత్తి కూరగాయల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి వచ్చే పంటలను ఎంచుకోవాలని సూచించారు.
రిజర్వాయర్ల పరిస్థితి: ప్రధాన రిజర్వాయర్లైన నిజాంసాగర్, పోచారం, కౌలాస్ నాలాలో నీటి నిల్వ సామర్థ్యం మరియు నీటి ప్రవాహం తక్కువగా ఉన్నందున వరి సాగును తగ్గించాలని కోరారు.
అవగాహన కార్యక్రమాలు: రైతు వేదికల్లో వ్యవసాయ, నీటిపారుదల శాఖ అధికారులు సంయుక్తంగా సమావేశాలు నిర్వహించి, రైతులకు ఆరుతడి పంటల ప్రాముఖ్యత, సాగు పద్ధతులు, ప్రభుత్వ సహాయాలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ విక్టర్, జిల్లా వ్యవసాయ అధికారి, మోహన్ రెడ్డి నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.







# నాడు ప్రజలలో లీడర్‌గా నేడు వృత్తి పైనే పూర్తి దృష్టి

రుద్రూరు/జులై 9/(జన సంఘర్షణ)

టిఆర్ఎస్ ప్రభుత్వం గత పది సంవత్సరాలుగా ఉన్నప్పుడు మంత్రిగా అదే విధంగా స్పీకర్ గా పనిచేసిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి హయాంలో ఎంతోమంది లీడర్‌గా ప్రజల్లో ఉండి సేవలు అందించిన వారు ఈరోజు నిరాశ నిస్పల గుర్రై ఎవరి పనులలో వారు నిమగ్నమై సైలెంట్ గా ఉండాల్సిన పరిస్థితి వచ్చిందని చర్చ, ప్రజలలో అనునిత్యం ఉంటూ ప్రజా సమస్యలు తెలుసుకుంటూ పరిష్కారంలో అహర్నిశలు కృషి చేసిన లీడర్లు, ప్రజా సమస్యలు తెలుసుకునేవారు ఎవరి పనులలో వారు నిమగ్నం కావడంతో ప్రజలు కొంత ఇబ్బంది పడుతున్న విషయం బయట జరుగుతున్న చర్చ, గత పది సంవత్సరాలలో లీడర్లు ప్రజల్లో ఉన్నవారు ఈరోజు ఎందుకు నిరాశ నిస్పల గుర్రై సైలెంట్ ఐ ఎవరి వృత్తిలో వారు ఉండాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది అనేది ప్రశ్నల వర్షం భారీగానే బయట వినిపిస్తున్నట్టు చర్చలు జరుగుతుంది. ఏది ఏమైనా అందరిలో సులమెన్ ఫారం గ్రామానికి చెందిన ఈ లీడర్ గత 15లలో యువకులకు ఆదర్శంగా ఉండి సులేమాన్ ఫారం గ్రామంలోనే కాదు రుద్రూరు మండలంలో కూడా ఒక మాస్ లీడర్ గా ఎదిగి ప్రజలు యువకులకు ఆదర్శంగా ఉండి చురుకుగా పనిచేసిన ఆ లీడర్ ప్రస్తుతం సైలెంట్ అయి తన వృత్తిపై దృష్టి పెట్టడం జరుగుతుంది అయితే దీని వెనుక కారణాలు ఏమిటి? ఎందుకు సైలెంట్ అయ్యారు అనేది చర్చ ,ప్రశ్నలు సర్వత్రరా వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా ఇలాంటి యువ లీడర్లు ప్రజల్లో ఉంటే ప్రజలకు ఇంకా సేవలు మెరుగుగా అంది అవకాశాలు ఉన్నాయనిది చర్చ జరుగుతుంది ఇతనే కాదు చాలామంది ఇలా లీడర్లు సైలెంట్ అయ్యి ఎవరి పనిలో వారు నిమగ్నమయ్యారు ప్రజా సమస్యలు వినేవారు కరువు అయ్యారు అనేది చర్చ బాగానే వినిపిస్తుంది, సమస్యలు ఎవరికి చెప్పాలో ప్రజలు సతమతమవుతున్నట్టు చర్చ వినిపిస్తుంది. ఆయన పేర్కొన్నారు.



# జులై 10న జరిగే బంద్‌ను విజయవంతం చేయండి

❑ బిడిఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు సంజయ్ తలారే పిలుపు

బోధన్/జూలై 9/(జన సంఘర్షణ)

ఈరోజు బోధన్ పట్టణంలోని స్థానిక పీఆర్టీయూ భవనంలో "బహుజన డెమోక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా బీడీఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు సంజయ్ తల్లారే మాట్లాడుతూ రేపు జూలై 10న జరిగే బందును విజయవంతం చేయాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఏదైతే రాష్ట్రంలో ఉన్నటువంటి 27 వేల ప్రభుత్వ పాఠశాలలను 4 వేలకు కుదించాలని ఆలోచన మానుకోవాలి. వెంటనే విద్యాశాఖ మంత్రిని కేటాయించాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు రెండు జతల యూనిఫామ్స్ పాఠ్యపుస్తకాలు అందించాలని మధ్యాహ్న భోజన పథకానికి నిధులు పెంచి బహుజన విద్యార్థులకు న్యాయం చేకూర్చాలని ఆయన అన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ విద్యా వ్యాపారాన్ని అరికట్టి ఫీజు నియంత్రణ చట్టం చేయాలని అన్నారు ఖాళీగా ఉన్న టీచర్ మరియు లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని ఆయన కోరారు పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయంబర్స్ విడుదల చేసి జీవో నెంబర్, 7,8,9 లను రద్దు చేయాలని అన్నారు. వెంటనే ఇంటర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని తక్షణమే ప్రారంభించి నిధులను కేటాయించాలని అదే భవనంలో నడుస్తున్న పాఠశాలలో ప్రభుత్వ సంక్షేమ హాస్టల్స్ ,గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలని ఆయన అన్నారు. అదేవిధంగా ప్రభుత్వ బడులలో చదువుకొని విద్యార్థులు బహుజనులు ఎక్కువ ఉంటారని కావున వారికి ఉచిత రవాణా సౌకర్యం కల్పించి బడి బస్సులు నడపాలి ఉచిత బస్సు పాసులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుకూలంగా మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచి పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి పాఠశాలకు కరెంట్ ఇంటర్నెట్, త్రాగునీటి వంటశాల,మరుగుదొడ్లు సౌకర్యాన్ని కల్పించాలని ఆయన కోరారు. విద్యాసంస్థల్లో ర్యాగింగ్, డ్రగ్స్ నిరోధక కమిటీలను ఏర్పాటు చేయాలని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. ఏదైతే బడుగు బలమైన వర్గాలకు చెందిన విద్యార్థులకు విద్యాహక్కు చట్టం ప్రకారం 25% శాతం సీట్లను ఉచితంగా కల్పించాలని తెలియజేశారు కాంగ్రెస్ విద్యా రంగానికి ఇచ్చిన హామీలను అమలు చేసి 5 లక్షల విద్య భరోసా కారుడు లను ఉచితంగా ఇవ్వాలని ఈ సందర్భంగా తెలియజేశారు.చీజూా 2020 తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయకుండా అసెంబ్లీలో తీర్మానం చేయాలని అయినా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బోధన్ డివిజన్ అధ్యక్షులు శ్రీ కిరణ్ కార్యదర్శి నరేందర్, నాయకులు మధు, అర్జున్, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.




# ప్రజాస్వామ్యానికి జర్నలిజం నాలుగో స్తంభం

❑ జర్నలిస్టుల హెల్త్ కార్డుల సమస్యను త్వరలో పరిష్కరిస్తాం :
❑ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

సంగారెడ్డి, /జూలై 9 : /(జన సంఘర్షణ)

ప్రజాస్వామ్య వ్యవస్థకు జర్నలిజం నాలుగో స్తంభమని, వార్తల ప్రసారంలో వేగం ఎంత అవసరమో విశ్వసనీయత అంతకంటే ముఖ్యమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. సత్యం, నైతికత, సామాజిక బాధ్యతలను జర్నలిజం ఎల్లప్పుడూ పరిరక్షించాలని ఆయన సూచించారు. గురువారం సంగారెడ్డిలోని టీఎన్జీవో భవన్‌లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ సంగారెడ్డి జిల్లా మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ..సంగారెడ్డి వేదికగా జర్నలిస్టుల మహాసభ నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. జర్నలిస్టులు ప్రజల గొంతుకగా, సమాజానికి దిశానిర్దేశం చేసే శక్తిగా బాధ్యతాయుత పాత్ర పోషిస్తున్నారని మంత్రి కొనియాడారు. వేగవంతమైన సమాచార ప్రసారంతో పాటు వార్తలలో వాస్తవికత, విశ్వసనీయత, నైతిక విలువలు పాటించడం జర్నలిజం యొక్క ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు.జర్నలిస్టుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న హెల్త్ కార్డుల సమస్యను ప్రభుత్వం సమీక్షిస్తోందని, త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకొని సమస్యను పరిష్కరిస్తామని మంత్రి తెలిపారు. మీడియా ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడంతో పాటు సమాజంలో చైతన్యం కల్పించే కీలక బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, జిల్లా అధ్యక్షులు బండారి యాదగిరి, ప్రధాన కార్యదర్శి విష్ణు ప్రసాద్, మాజీ అధ్యక్షుడు మల్లికార్జున రెడ్డి, వివిధ జిల్లాల అధ్యక్షులు, నాయకులు ఫైజల్, పానుగంటి కృష్ణ, అనిల్ కుమార్, ఆసిఫ్, సిద్ధన్న పాటిల్, మునిపల్లి యాదగిరి, మున్సిపల్ చైర్పర్సన్ లు వనిత, అంజమ్మ, జిల్లా సీనియర్ జర్నలిస్టులు, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.




# ఏసీబీకి చిక్కిన పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజనీర్

కరీంనగర్/జూలై 9/(జన సంఘర్షణ)

ప్రభుత్వ పనుల కొలతలు నమోదు చేసి, అధికారికంగా ముందుకు పంపేందుకు అనుకూలంగా వ్యవహరించేందుకు లంచం డిమాండ్ చేసి స్వీకరించిన ఆరోపణలపై పంచాయతీరాజ్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. కరీంనగర్ ఏసీబీ రేంజ్ యూనిట్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, చొప్పదండి మండల పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ పైడి సతీష్ (గతంలో గంగాధర మండల ఏఈగా పనిచేశారు) గురువారం సాయంత్రం లంచం తీసుకుంటుండగా పట్టుబడ్డారు. ఫిర్యాదుదారుడు చేపట్టిన ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కింద సీసీ పనులకు సంబంధించిన కొలతలను ఎం బుక్ నమోదు చేసి, వాటిని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్కు పంపేందుకు అధికారిక సహాయం చేయడానికి ప్రతిఫలంగా రూ.10,000 లంచం డిమాండ్ చేసి స్వీకరించినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. లంచం మొత్తాన్ని నిందిత అధికారి ఉపయోగిస్తున్న టీవీఎస్ జూపిటర్ ద్విచక్ర వాహనం (నంబర్ టీఎస్ 02 ఎఫ్ఎఫ్ 8800) సీటు కింద ఉన్న ఖాళీ ప్రదేశం నుంచి స్వాధీనం చేసుకున్నట్లు ఏసీబీ వెల్లడించింది. అధికారిక విధులను సక్రమంగా నిర్వహించకుండా, అక్రమ ప్రయోజనం పొందేందుకు ప్రయత్నించినందుకు నిందితుడిపై చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. పైడి సతీష్ను అరెస్ట్ చేసి కరీంనగర్ ప్రత్యేక న్యాయస్థానం (ఎస్పిఈ ఁ ఏసిబి కేసులు) ముందు హాజరుపరచనున్నట్లు పేర్కొన్నారు. ఈ కేసు ప్రస్తుతం దర్యాప్తులో ఉందని ఏసీబీ అధికారులు తెలిపారు. ఫిర్యాదుదారుడి భద్రత దృష్ట్యా ఆయన వివరాలను గోప్యంగా ఉంచినట్లు వెల్లడించారు.



# ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్గా శ్రీధర్ బాధ్యతల స్వీకరణ నిజామాబాద్ డివిజన్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ...

నిజామాబాద్/జూలై 9/( జనసంఘర్షణ)

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్గా శ్రీధర్ బాధ్యతల స్వీకరణ నిజామాబాద్ డివిజన్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ నూతన డిప్యూటీ కమిషనర్గా పి. శ్రీధర్ బాధ్యతలు స్వీకరించారు.
ఈ సందర్భంగా ఆయనకు డివిజన్ మినిస్టీరియల్ సిబ్బంది, టీఎన్జీవోస్ ఎక్సైజ్ ఫోరమ్ ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. ఇదే కార్యక్రమంలో కామారెడ్డి డీపీఈఓ గా బాధ్యతలు చేపట్టిన ముకుంద రెడ్డిని సైతం వారు ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా నూతన డిప్యూటీ కమిషనర్ శ్రీధర్ మాట్లాడుతూ.. శాఖా పరమైన లక్ష్యాలను చేరుకోవడంలో సిబ్బంది అందరి సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. సమర్థవంతమైన పాలన అందించడమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ విధుల్లో అంకితభావంతో పనిచేయాలని సూచించారు.




# రైలు నుంచి పడి వృద్ధుడి మృతి..

జానకంపేట-నిజామాబాద్/జులై 9/(జన సంఘర్షణ)

రైలు నుంచి ప్రమాదవశాత్తూ కింద పడి ఓ గుర్తుతెలియని వృద్ధుడు (60) మృతి చెందిన సంఘటన గురువారం జానకంపేట- నిజామాబాద్ రైల్వే మార్గంలో చోటుచేసుకుంది. రైల్వే ఎస్ఐ సాయి రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఉదయం 10 గంటల సమయంలో జానకంపేట-నిజామాబాద్ రైల్వే స్టేషన్ల మధ్య కిలోమీటర్ నంబర్ 456/03-04 వద్ద ఒక వృద్ధుడు రైలు నుంచి పడిపోయినట్లు సమాచారం అందింది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా, అప్పటికే ఆయన మృతి చెందినట్లు గుర్తించారు.




# వృత్తి నైపుణ్యంతోనే బాధితులకు సత్వర న్యాయం..

❑ నిజామాబాద్ వేదికగా 'జోన్-2 బాసర స్థాయి పోలీస్ డ్యూటీ మీట్' ప్రారంభం

నిజామాబాద్/జూలై 9/(జన సంఘర్షణ)

పోలీసు విధి నిర్వహణలో వృత్తి నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానం అత్యంత కీలకమని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయిచైతన్య అన్నారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న మూడవ పోలీస్ డ్యూటీ మీట్లో భాగంగా, గురువారం నిజామాబాద్ కమిషనరేట్ వేదికగా జోన్-2 (నిజామాబాద్, జగిత్యాల్, నిర్మల్, ఆదిలాబాద్) స్థాయి పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పోలీస్ శాఖలో క్షేత్రస్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు విధుల్లో రాణించాలంటే వృత్తిపరమైన మెళకువలు తప్పనిసరని పేర్కొన్నారు. నేరాల దర్యాప్తులో శాస్త్రీయ పద్ధతులను అనుసరించడం, ఫోరెన్సిక్, ఫింగర్ ప్రింట్ ఆధారాలను సేకరించడంలో నిపుణులుగా ఎదిగేందుకు ఈ పోటీలు ఎంతో దోహదపడతాయని వివరించారు. మారుతున్న నేరాల తీరుకు అనుగుణంగా పోలీసులు తమను తాము ఆధునీకరించుకోవాలని, తద్వారా నేర పరిశోధనలో అత్యుత్తమ ఫలితాలు సాధించాలని ఆయన పిలుపునిచ్చారు. నిజామాబాద్ పోలీస్ హెడ్ క్వార్టర్స్, కమాండ్ కంట్రోల్ సెంటర్లలో ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. సైంటిఫిక్ ఎయిడ్స్, కంప్యూటర్స్, డాగ్ స్క్వాడ్, ప్రొఫెషనల్ ఫోటోగ్రఫీ, ఎక్స్ప్లోజివ్, నార్కోటిక్, ఫోరెన్సిక్ మెడిసిన్ వంటి అంశాల్లో ఎంపిక పరీక్షలు రెండు రోజుల పాటు కొనసాగుతాయి. ఇక్కడ విజేతలుగా నిలిచిన వారు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కమిషనర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు డి.సి.పి (అడ్మిన్) ఎన్. శుభం ప్రకాష్, ఏ.సి.పిలు ప్రకాష్ యాదవ్, రాజశేఖర్, శ్రీశైలం, గురునాయుడు, నరేందర్, డాక్టర్ నాగేంద్రబాబు, సి.ఐలు, ఎస్. ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
శుక్రవారం
10 జులై 2026

## రెండవ వార్డులో ఎన్యూమరేషన్ కేంద్రంను సందర్శించిన...

కామారెడ్డి జిల్లా/ బాన్సువాడ,/ జూలై 9/ (జన సంఘర్షణ)



బాన్సువాడ పట్టణంలోని రెండవ వార్డ్ కోట గల్లీలో గురువారం సర్ ప్రక్రియలో భాగంగా ఎన్యూమరేషన్ కేంద్రాన్ని తహసిల్దార్ రాజా నరేందర్ గౌడ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఓటర్ నమోదు జాబితాలో ఎంతమంది ఎన్యూమరేషన్ పారాలు సేకరించారు, ఇంకా ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి బిఎల్ లను అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికి వెళ్లి ఓటర్ జాబితా పారాలను అందజేసి ఎన్యుమరేషన్ పారాలలో నమోదు చేయాలని ప్రజలకు అందుబాటులో ఉండి నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని బిఎల్వో లకు ఆదేశించారు. ఆయన వెంట 2వ వార్డ్ కౌన్సిలర్ జంగం రాజశేఖర్, బిఎల్ఓ లక్ష్మి ఉన్నారు.

## గ్రామంలో బెల్ట్ షాపులు ఉండకూడదు..

బోధన్/జులై 9/(జన సంఘర్షణ)



బెల్లాల గ్రామంలో ఇందిరమ్మ కాలనీలో ప్రతి మహిళలతో బెల్టు షాపుల విషయంలో మహిళలతో వికలాంగుల జాతీయ అధ్యక్షురాలు సుజాత సురా వంశీ మాట్లాడడం జరిగింది మహిళలు గ్రామంలో బెల్ట్ షాపుల్లో ఉండకూడదని ఆమెకు కోరినారు. ఉదయం ఆరు గంటలకే మందుకు బానిస అవుతున్నారు గంజాయి కి కూడా బానిస అవుతున్నారు యువకులు బోధన్ నుండి మన గ్రామంలో వచ్చి ఎక్కడబడితే అక్కడే మందు తాగుతున్నారు. ఇంత చిన్న ఊర్లో బెల్ట్ షాపులు చాలా ఉన్నాయి. గ్రామంలో దొంగతనాలు కూడా అవుతున్నాయి. ఆడవాళ్లకు రక్షణ లేక పోతుంది కిరాణా షాపులో పేర్లు చెప్పుకొని మందులు అమ్ముతున్నారు. వాళ్ల మీద కఠిన చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారులకు తెలియడం జరిగింది. చిన్న ఊరిలో ఎనిమిది బెల్ట్ షాపులు వికలాంగుల జాతీయ అధ్యక్షురాలు సూర్యవంశం సుజాత పోరాటం చేయడం జరుగుతుంది.

## హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు

కామారెడ్డి జిల్లా/జూలై 9/(జన సంఘర్షణ)





తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖల గౌరవ మంత్రి, కామారెడ్డి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సీతక్కకి జన్మదిన శుభాకాంక్షలు. ప్రజాసేవ పట్ల మీ అంకితభావం, నిరంతర కృషి, నాయకత్వం మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, మీరు సంపూర్ణ ఆయురారోగ్యాలు, ఆనందం, విజయాలతో దీర్ఘాయుష్షుతో ప్రజలకు మరింత సేవ చేసే అవకాశాలు కలగాలని హృదయపూర్వకంగా ఆకాంక్షిస్తున్నాను. కామారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షులుఏలే మల్లికార్జున్ పేర్కొన్నారు.

## బాన్సువాడ డోంగ్లి శ్రీనివాస్ పటేల్‌ని మున్నూరు కాపు ఆత్మగౌరవ మహాధర్నా సేన రాష్ట్ర కోకన్వీనర్‌గా నియమించడం జరిగింది..

బీర్కూర్/జులై 9/(జన సంఘర్షణ)

రాష్ట్ర జిల్లా మండలంలో ఉన్న గ్రామస్థాయి కమిటీలను బలపరిచి మున్నూరు కాపుల ఐక్యత అభ్యున్నతి ఆర్థిక సామాజిక రాజకీయ రిజర్వేషన్లు మున్నూరు కాపుల కోసం తన పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ ధన్యవాదాలు డోంగ్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


మున్నూరుకాపు ఆత్మగౌరవ మహా ధర్న సేన

నియామక పత్రం

Dt : 08/07/2026

Dongli Srinivas Patel ... D. Gangaram ... Mahadarna Sena State Co-conviner ... 08/07/2026 ... 25/05/2028 ...

Mobile No. 8008914370

Vuggey Srinivas Patel

## తెలంగాణలో సమర్థవంతమైన పాలన రేవంత్ రెడ్డితోనే సాధ్యం

- బీఆర్ఎస్ అప్పుల పాలు చేసి కాంగ్రెస్ ను విమర్శించడం సరైంది కాదు
- సబ్బండ వర్గాల సంక్షేమం కాంగ్రెస్ తోనే సాధ్యం
- మాజీ మేయర్ ధర్మపురి సంజయ్

నిజామాబాద్ అర్బన్,/జూలై 9/(జన సంఘర్షణ)



తెలంగాణకు రేవంత్ రెడ్డి సమర్థవంతమైన పాలన అందిస్తున్నారని నిజామాబాద్ నగర మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ వెల్లడించారు. బీఆర్ఎస్ చేసిన అప్పులు తీరుస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్నారని మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ అన్నారు. గురువారం ప్రగతి నగర్ మున్నూరు కాపు సంఘం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటి నెరవేరుస్తూ, అభివృద్ధి కోసం ప్రణాళికలు రచిస్తుందన్నారు. కాంగ్రెస్ పాలనలోనే పబండ వరాల సంక్షేమం అభినది పారుతుందన్నారు. గతఅప్పుల పాలు చేసి అభివృద్ధి చేయడం లేదని కాంగ్రెస్ విమర్శించడం సరైంది కాదన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి తెలంగాణ కు దౌర్భాగ్యపు పరిస్తితి వచ్చేలా చేశారన్నారు. అప్పులకుప్పగా మార్చి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఏమి చేయడం లేదని మాట్లాడడం హాస్యస్పదంగా ఉందన్నారు. ఈ రాష్ట్రం ఇలా ఉండడానికి కారణం బీఆర్ఎస్ కాదా అని ప్రశ్నించారు. సోనియా గాంధీ చొరవ వల్లనే తెలంగాణ వచ్చిందనీ, ఇచ్చిన మాట ప్రకారం బిల్లు పెట్టించి ఆమోదించేలా చేశారన్నారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన పార్టీ, దేశానికి రాష్ట్రానికి స్వతంత్రం తెచ్చింది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. రాష్ట్రాన్ని జిల్లాను ఇంకా అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని, రేవంత్ రెడ్డి హయాంలోనే అభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. ఆయనను మించిన నాయకుడు లేడన్నారు. ముఖ్యమంత్రి తెలంగాణను అభివృద్ధి చేయడం కోసం సెలవు తీసుకోకుండా అహర్నిశలు పనిచేస్తున్నారన్నారు. నిజామాబాద్ లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పూర్తి చేసుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్ పై ఉందన్నారు. ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు కావస్తుందని, అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం ఉందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా లేవన్నారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చిన ఘనత రేవంత్ రెడ్డి ప్రభుత్వానిదే అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తున్నారని, కోటిమంది కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించారన్నారు. కష్టపడి పని చేసిన వారికి పదవులువస్తాయని, ఎలాంటి పదవులు లేకున్నా తాను ప్రజల కోసం పనిచేస్తున్నానన్నారు.

## ఈ రోజు హంగార్గా ఫారం గ్రామ పంచాయతీలో బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ముహమ్మద్ అజీమ్ ముద్దీన్ ఆధ్వర్యంలో 'సర్'


హంగార్గా/జూలై 9/(జనసంఘర్షణ)




ఈ రోజు హంగార్గా ఫారం గ్రామ పంచాయతీలో బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ముహమ్మద్ అజీమ్ ముద్దీన్ ఆధ్వర్యంలో 'సర్' కార్యక్రమంలో భాగంగా ఓటరు జాబితా కరెక్షన్, వెరిఫికేషన్‌పై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా 'సర్' ప్రక్రియ వల్ల కలిగే ప్రయోజనాలు, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అలాగే ఓటరు వివరాలు సక్రమంగా నమోదు చేయించుకోవడం యొక్క ప్రాముఖ్యతను గ్రామ ప్రజలకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తరతరలో పాల్గొన్నారు.

## రాష్ట్రంలో 1,500 కండక్టర్ పోస్టులకు గ్రీన్ సిగ్నల్


హైదరాబాద్/జులై 9/(జన సంఘర్షణ)



రాష్ట్రవ్యాప్తంగా 1,500 కండక్టర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. దీంతో నోటిఫికేషన్ విడుదల చేసేందుకు ఆర్టీసీ యాజమాన్యం సిద్ధమవుతోంది. టెన్త్ మార్కుల ఆధారంగా ఎంపిక చేయనున్నట్లు తెలుస్తోంది. అయితే పదో తరగతిలో కొందరికి మార్కులు, మరికొందరికి గ్రేడింగ్ పాయింట్లు ఉండటంతో ఎస్సెస్సీ బోర్డుకు ఆర్టీసీ లేఖ రాసింది. గ్రేడింగ్ను మార్కుల శాతంగా ఎలా లెక్కించాలనే దానిపై కసరత్తు చేస్తోంది.

## పాత్రికేయుల ఆధ్వర్యంలో లైన్స్ క్లబ్ వారిచే ఉచిత మెగా వైద్య శిబిరం..

పోతంగల్ / జూలై9/(జన సంఘర్షణ)





డాక్టర్.కె.వి.రెడ్డి మెమోరియల్ హాస్పటల్ లైన్స్ క్లబ్ బోధన్ వారి ఆధ్వర్యంలోప్రతి ఒక్కరూ ఆరోగ్యం పై దృష్టి పెట్టాలి అని లైన్స్ క్లబ్ ఇన్చార్జి హనుమంతరావు అన్నారు. లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పొతంగల్ మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు వైద్య చికిత్సలు,800 మందికి ఉచితంగా చికిత్సలు చేసి మందులు పంపిణీ చేశారు. 20 మందికి కంటి చికిత్సలు, నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని, ప్రతిరోజు తప్పనిసరిగా వ్యాయామం చేయాలని అన్నారు. ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేయరాదని ఏ కొంచెం అనారోగ్యం అన్పించిన వెంటనే ఆస్పత్రిలోని వైద్యులకు సంప్రదించి తగిన చికిత్సలు చేయించుకొని వారి సలహా ప్రకారం ఆరోగ్యం కాపాడుకోవాలని, కంటికి సంబంధించినటువంటి ఆపరేషన్ లో ఉంటే బోధన్ లైన్స్ క్లబ్ హాస్పిటల్ లో నిర్వహిస్తామని సూచించారు. ఈ కార్యక్రమంలో జనరల్ హాస్పిటల్ డాక్టర్, విక్రమ్, డాక్టర్ కృష్ణ ఎంబిబిఎస్, చిన్నపిల్లల నిపుణులు వైద్యుడు డాక్టర్ ప్రవీణ్, లయన్ క్లబ్ ఇంచార్జ్ హనుమంతరావు, గ్రామ సర్పంచ్ కల్లూరి సంధ్య బజరంగ్, ఉప సర్పంచ్ గులాబ్ నబి, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాల జిల్లా నగర మున్సిపాలిటీ కేంద్రంలో మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్ సంతకాన్ని ఫోర్జరీ చేసిన వ్యవహారం తీవ్ర సంచలనం..!!

- నిజాంబాద్ జిల్లాలో పలు అధికారుల సంతకాలు జిల్లా అధికారుల సంతకాలు 4జి అవడంతో కలకలం లేపుతుంది.
- ఇప్పటివరకు వారిపై ఎలాంటి చర్యలు లేవు.
- ఈరోజుమున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్ సంతకాన్ని ఫోర్జరీ చేసిన వ్యవహారం తీవ్ర సంచలనం.

జగిత్యాల/జూలై 9/( జన సంఘర్షణ)




తెలంగాణ రాష్ట్రం జగిత్యాల జిల్లా నగర మున్సిపాలిటీలో ఆస్తి పన్ను మినహాయింపు కోసం మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్ సంతకాన్ని ఫోర్జరీ చేసిన వ్యవహారం సంచలనంగా మారింది. ఈ ఘటనకు సంబంధించిన ముఖ్య వివరాలు: నేపథ్యం:దిజగిత్యాల పట్టణానికి చెందిన సమిండ్ల మల్లయ్య పేరుపై ఉన్న ఒక ఇంటి నంబర్‌కు (3-5-128) సంబంధించిన అధికారులు పేర్కొన్నారు.

## సర్ ఓటర్ నమోదు కార్యక్రమంలో భాగంగా

కరీంనగర్/జూలై 9/( జన సంఘర్షణ)

కరీంనగర్ జిల్లా అర్బన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ ఆదేశాల మేరకు 46వ డివిజన్లో బూతు నెంబర్ 347 లో గల ఇంటి ఇంటికి తిరుగుతూ వార్డ్ ఆఫీసర్‌తో కలిసి ఓటర్లకు అవగాహన కల్పిస్తూ తెలియని వారికి స్వయంగా ఫామ్స్ నింపి ఓటర్ నమోదు ప్రక్రియ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బి ఎల్ ఎ శిరీష మేడం అండ్ మాలోత్ మహాలక్ష్మి కరీంనగర్ కార్పొరేషన్ సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు.



Printed, published and owned by **Rachamallu Madhavi** Printed at **Kranthi Printing Press**, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : **Rachamallu Madhavi**. **RNI Reg No :tel/2024/89323,** Cell 6305026524, Email:janasangarshana@gmail.co